

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 127 | సోమవారం 11 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3


**గిల్, సాయి సుదర్శన్ మెరుపులు.. రాజస్థాన్ బౌలర్లు బేజారు**



# ఏడాది పాటు ప్రజలు బంగారం కొనొద్దు:

సికింద్రాబాద్ సభలో ప్రధాని మోదీ ప్రసంగం
ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు సహకరించాలన్న ప్రధాని
ఇంధనాన్ని పొదుపు చేసి, ప్రజా రవాణాను ఎక్కువగా వినియోగించాలని సూచన
వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి ప్రారంభించి, అనవసర ప్రయాణాలు తగ్గించాలని సలహా
విదేశీ యాత్రలు, బంగారం కొనుగోళ్లు కొంతకాలం వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి
రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సహజ వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపు





# విజయ్ సీఎం పీఠం ఎక్కిన కొన్ని గంటల్లోనే వివాదం...

**ప్రమాణస్వీకారంలో తమిళ గీతాన్ని మూడో స్థానంలో ఆలపించడంపై టీవీకే సర్కారు అభ్యంతరం**
**కేంద్రం సర్క్యులర్ వల్లేనని గవర్నర్ కార్యాలయం నుంచి వివరణ**
**భవిష్యత్తులో పాత పద్ధతినే పాటిస్తామని మంత్రి ఆధవ్ అర్జున స్పష్టీకరణ -**
**ఈ కొత్త విధానం తమిళనాడుకు తగదని ప్రభుత్వం వెల్లడి**

తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొన్ని గంటల్లోనే ఓ వివాదం మొదలైంది. సీఎంగా విజయ్, ఇతర మంత్రుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో తమిళ రాష్ట్ర గీతాన్ని మూడో స్థానంలో ఆలపించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత వందేమాతరం, ఆ తర్వాత జాతీయ గీతం, చివరగా తమిళ రాష్ట్ర గీతమైన 'నీరారుం కడలుత'ను ఆలపించారు. వాస్తవానికి తమిళనాడులో ప్రభుత్వ కార్యక్రమాలు రాష్ట్ర గీతంతో ప్రారంభమై, జాతీయ గీతంతో ముగియడం దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం.

# నాడు పీకలు కోసి.. నేడు నీతులు మాట్లాడటమా?

**వైసీపీ నేతలపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర విమర్శలు**
**నాడు అరాచకాలు చేసి నేడు నీతులు చెబుతున్నారని ఎద్దేవా**
**విద్యా, వైద్య రంగాలను జగన్ సర్కార్ నాశనం చేసిందని ఆరోపణ**
**ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టింది వైసీపీయేనని ఫైర్**
**పీపీపీ విధానంతోనే మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం**



వైసీపీ నేతలు నాడు ప్రజల పీకలు కోసి, అరాచకాలకు పాల్పడి.. నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వారి ఉత్తర కుమార ప్రగల్భాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.

**వైద్య రంగంలో వాస్తవాలు ఇవి** ఓ స్వయం ప్రకటిత మేధావి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తామే కట్టామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్ అని, ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు



# మోదీకి వెంకటగిరి జామ్దానీ శ్రీవారి చిత్రం..

**హైదరాబాద్ పర్యటనలో ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆతిథ్యం**
**వెంకటగిరి జామ్దానీ నేతతో నేసిన శ్రీవారి చిత్రాన్ని బహూకరించిన సీఎం కుటుంబం**
**మంత్రి నారా లోకేష్‌ను ఆప్యాయంగా పలకరించిన ప్రధాని**
**గంటకు పైగా చంద్రబాబు కుటుంబ సభ్యులతో గడిపిన నరేంద్ర మోదీ**
**రాజకీయ బంధంతో పాటు బలపడుతున్న కుటుంబ అనుబంధం**

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబం అరుదైన, ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి తమ కుటుంబం తరపున ఒక విశిష్టమైన బహుమతిని అందించారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కళావైభవానికి ప్రతీకగా నిలిచే వెంకటగిరి జామ్దానీ నేతతో ప్రత్యేకంగా రూపొందించిన శ్రీవారి చిత్రపటాన్ని కానుకగా సమర్పించారు.

# వేములవాడ భీమన్న ఆలయంలో భక్తుల రద్దీ..



**కోడె మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

**వేములవాడ టౌన్ మే 10 సూర్యా న్యూస్ :-** దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తొలుత తలనీలాల మొక్కులు చెల్లించుకుని పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలోకి ప్రవేశించి శ్రీస్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# తమిళనాడు అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా కరుప్పయ్య

**తమిళనాడులో కొత్త ప్రభుత్వం రేపు ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన ఎమ్మెల్యేలు**
**ప్రొటెం స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే ఎం.వి. కరుప్పయ్య నియామకం**
**కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్**
**గతంలో అన్నాడీఎంకేలో పనిచేసి, ఇటీవలే విజయ్ పార్టీలో చేరిన కరుప్పయ్య**

# అమెరికాలో తెలంగాణ టెక్కీ హఠాన్మరణం



అమెరికాలో తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
గద్వాల వాసి సునీల్ కుమార్ (51) గుండెపోటుతో మరణం

# ఏడాది పాటు ప్రజలు బంగారం కొనొద్దు:

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశ ప్రజలు కొన్ని త్యాగాలు చేయాలని కోరారు. ఇంధనాన్ని పొదుపు చేయడం, ప్రజా రవాణాను ఉపయోగించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని తిరిగి ప్రారంభించడం, అనవసర వస్తువుల కొనుగోళ్లు, విదేశీ పర్యటనలు మానుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్ల జోలికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు.

**ఐక్యంగా పోరాడదాం** అంతర్జాతీయ ఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రజలందరి సమష్టి భాగస్వామ్యం అవసరమని నొక్కి చెప్పారు. కష్ట సమయాల్లో దేశం కోసం బాధ్యతాయుతంగా జీవించడం, మన కర్తవ్యాలను నెరవేర్చడం కూడా దేశభక్తేనని ఆయన అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేయడమే కాదు, దేశం కోసం జీవించడం కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. "ప్రస్తుత పరిస్థితుల్లో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడంపై మనం ప్రత్యేక దృష్టి పెట్టాలి. మనమందరం కలిసికట్టుగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

**ఇంధన పొదుపు అత్యవసరం** ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయని, వాటి కొనుగోలుకు వెచ్చిస్తున్న విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం మనందరి బాధ్యత అని ప్రధాని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న చోట మెట్రో రైలు, ఇతర ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రైవేట్ వాహనాలు అవసరమైనప్పుడు కార్‌పూలింగ్ విధానాన్ని ఎంచుకోవాలని కోరారు. సరుకు రవాణాకు రైల్వేలను ఎక్కువగా ఉపయోగించాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచాలని సూచించారు.

**కొవిడ్ నాటి పద్ధతులు పునరుద్ధరించాలి**దేశ ప్రయోజనాల దృష్ట్యా కరోనా మహమ్మారి సమయంలో పాటించిన కొన్ని పద్ధతులను తిరిగి ప్రారంభించాలని ప్రధాని కోరారు. వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల వంటి విధానాలకు మళ్లీ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "కరోనా సమయంలో మనం ఈ పద్ధతులకు అలవాటు పడ్డాం. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడం దేశానికి ఎంతో అవసరం" అని ఆయన అన్నారు.

**విదేశీ ప్రయాణాలు, కొనుగోళ్లు వాయిదా** విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడేందుకు ప్రజలు అనవసరమైన విదేశీ ప్రయాణాలు, విదేశాల్లో విహారయాత్రలు, పెళ్లిళ్లు వంటివి మానుకోవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, వేడుకలను భారతదేశంలోనే జరుపుకోవాలని కోరారు. అలాగే, కనీసం ఒక సంవత్సరం పాటు అనవసరమైన బంగారం కొనుగోళ్లను నివారించాలని సలహా ఇచ్చారు.

"మేడ్-ఇన్-ఇండియా" ఉత్పత్తులకే ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా బూట్లు, బ్యాగులు వంటి రోజువారీ వస్తువులను స్థానికంగా తయారైనవే కొనాలని సూచించారు.

**రైతులకు, కుటుంబాలకు సూచనలు** ప్రతి కుటుంబం వంట నూనె వినియోగాన్ని తగ్గించుకోవాలని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని ప్రధాని హితవు పలికారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని 50 శాతం తగ్గించాలని, సహజ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని కోరారు. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వివరించారు. డీజిల్ పంపులకు బదులుగా సౌరశక్తితో నడిచే పంపుసెట్లను ఎక్కువగా వినియోగించుకోవాలని ఆయన రైతులను ప్రోత్సహించారు. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల బస్తా ధర సుమారు రూ. 3,000 ఉండగా, భారత ప్రభుత్వం రైతులకు కేవలం రూ. 300 లోపే అందిస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా తనపై వేసుకుంటోందని, అయితే సంక్షోభం తీవ్రంగా ఉన్నందున ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు. "భారతమాతను ప్రథమ స్థానంలో నిలిపి, మనమందరం ఐక్యంగా పోరాడాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

## విజయ్ సీఎం పీఠం ఎక్కిన కొన్ని గంటల్లోనే వివాదం...

దీనికి భిన్నంగా జరగడంతో విజయ్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఈ కొత్త పద్ధతిపై విజయ్ ప్రభుత్వంలోని మంత్రి ఆధవ్ అర్జున ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తమిళనాడుకు తగని పద్ధతి అని, దీన్ని తమ ప్రభుత్వం అంగీకరించదని స్పష్టం చేశారు. ఈ విషయంపై గవర్నర్ కార్యాలయాన్ని సంప్రదించగా, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కొత్త సర్క్యులర్ కారణంగానే అలా చేయాల్సి వచ్చిందని తెలిపిందని ఆయన పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే తమిళ గీతాన్ని మూడో స్థానంలో ఆలపించారని వివరించారు. "వంద సంవత్సరాలకు పైగా చారిత్రక నేపథ్యం ఉన్న "నీరారుం కడలు తుధ...!" అనే తమిళ ప్రార్థనా గీతాన్ని ప్రపంచమంతా వ్యాపించాలనే ఆకాంక్షతో తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించింది. ప్రభుత్వ కార్యక్రమాలతో సహా తమిళనాడులో జరిగే ప్రతీ ఈవెంట్‌లోనూ మొదటగా ఈ ప్రతిష్టాత్మకమైన తమిళ గీతాన్ని ఆలపించడం, చివర్లో జాతీయ గీతంతో ముగించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ సంప్రదాయంపై తమిళగ వెట్రి కళగం నాయకత్వంలో ఏర్పడిన మా ప్రభుత్వానికి ఎలాంటి భిన్నాభిప్రాయం లేదు. అయితే, ఈరోజు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అధ్యక్షతన జరిగిన ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఈ సంప్రదాయానికి భిన్నంగా జరిగింది. మొదట వందేమాతరం, తర్వాత జాతీయ గీతం, మూడో స్థానంలో తమిళ ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. ఈ కొత్త పద్ధతి తమిళనాడుకు తగింది కాదు. మాతృభూమి తమిళనాడులో, తమిళ ప్రార్థనా గీతానికి మూడో స్థానం ఇవ్వడాన్ని తమిళగ వెట్రి కళగం నాయకత్వంలోని మా ప్రభుత్వం అంగీకరించదు. ఈ విషయంపై మేము గవర్నర్ కార్యాలయాన్ని వివరణ కోరగా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన కొత్త సర్క్యులర్ ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందని వారు తెలిపారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో తమిళ గీతాన్ని మూడో స్థానంలో ఉంచాల్సి వచ్చిందని చెప్పారు. అయితే, భవిష్యత్తులో ఈ కొత్త పద్ధతిని అనుసరించబోమని, గతంలో మాదిరిగానే కార్యక్రమం ప్రారంభంలో తమిళ గీతం, ముగింపులో జాతీయ గీతం ఆలపిస్తామని వారు హామీ ఇచ్చారు. తమిళనాడులోనే కాదు, భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ కార్యక్రమాల ప్రారంభంలో ఆయా రాష్ట్ర భాషా ప్రార్థనా గీతాలనే ఆలపించాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఇదే తమిళనాడు ప్రజలందరి ఏకాభిప్రాయం, ఆకాంక్ష. మా గట్టి వైఖరి కూడా ఇదే" అని ఆధవ్ అర్జున తన ట్వీట్ లో స్పష్టం చేశారు.

## నాడు పీకలు కోసి.. నేడు నీతులు మాట్లాడటమా?

22 మెడికల్ కాలేజీలు నిర్మించారని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మక ఎయిమ్స్‌ను ఏపీకి తీసుకొచ్చింది చంద్రబాబే అయితే, దానికి ఐదేళ్ల పాటు కనీసం తాగునీరు కూడా ఇవ్వని నీచ చరిత్ర జగన్ రెడ్డిదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎయిమ్స్‌కు కృష్ణా జలాలను అందించిన ఘనత తమదేనని స్పష్టం చేశారు. "ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడం తప్ప జగన్ చేసిందేమిటి? రూ.8,480 కోట్ల అంచనాతో 17 కాలేజీల నిర్మాణానికి కేంద్రం నిధులు మినహా రాష్ట్రం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు" అని ఆరోపించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పనులు ఆలస్యమవుతాయనే ఉద్దేశంతోనే ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిన పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని ఎంచుకున్నామన్నారు. ఈ విధానం ద్వారా రెండేళ్లలో 2500 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. పీపీపీ ఆసుపత్రుల్లో 70 శాతం పడకలు ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ లబ్ధిదారులకు కేటాయించి పేదలకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు.

**విద్యా వ్యవస్థను ధ్వంసం చేశారు**జగన్ రెడ్డి హయాంలో విద్యా రంగం పూర్తిగా నాశనమైందని కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2014-19 మధ్య విద్యా ప్రమాణాల్లో మూడో స్థానంలో ఉన్న ఏపీ, 2019-24 నాటికి 19వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు. "ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. వేలాది స్కూళ్లను మూసివేసి గ్రామీణ విద్యార్థులను చదువుకు దూరం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత 62 శాతానికి పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక దాన్ని 85 శాతానికి పెంచిన ఘనత నారా లోకేశ్‌ది. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం" అని తెలిపారు. జగన్ పాలనలో విద్యార్థులు కనీసం అంకెలు, అక్షరాలు కూడా గుర్తించలేని స్థితికి దిగజారారని 'అసర్' సంస్థ నివేదికను ఉటంకించారు. నాడు-నేడు పేరుతో రంగులేసుకుని వేల కోట్లు దిగమింగారని, ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు.

**ఆస్తులు తాకట్టు పెట్టింది మీరు కాదా?**పీపీపీ పేరుతో ఆస్తులు దోచిపెడుతున్నారంటూ వైసీపీ చేస్తున్న విమర్శలను రవీంద్ర తిప్పికొట్టారు. రాష్ట్ర ఆస్తులను, చివరికి తాగుబోతులను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన ఘనత జగన్‌దేనని ఆరోపించారు. గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులను ప్రైవేటుకు కట్టబెట్టారని, అమరావతి భూములను తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఒక్క విశాఖలోనే కలెక్టరేట్‌తో సహా 13 కీలక ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి రూ.1600 కోట్లు అప్పు చేశారని, దీనిని ప్రజాధనం దుర్వినియోగం అంటారని అన్నారు.

**వ్యవస్థల విధ్వంసం, అరాచక పాలన** జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో వ్యవస్థల విధ్వంసం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని మంత్రి అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలుపెట్టి, అమరావతిని చంపి, పోలవరాన్ని నాశనం చేశారని విమర్శించారు. బడుగు బలహీన వర్గాలపై దాడులు, ప్రశ్నించిన వారిపై హత్యలతో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేశారని ఆరోపించారు.

## మోదీకి వెంకటగిరి జామ్దానీ శ్రీవారి చిత్రం... బలపడుతున్న నమో-నారా బంధం!

తిరుమల శ్రీవారిని కీర్తించే శ్లోకంతో పాటు నేసిన ఈ చిత్రపటం రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు అద్దం పట్టేలా ఉంది. తమ ఇంటికి వచ్చిన విశిష్ట అతిథికి ఏపీ సంప్రదాయాన్ని ప్రతిబింబించే కానుకను అందించి చంద్రబాబు కుటుంబం తమ గౌరవాన్ని చాటుకుంది. తన అధికారిక పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ప్రధాని మోదీ, తన బిజీ షెడ్యూల్‌లోనూ చంద్రబాబు కుటుంబానికి ప్రత్యేకంగా గంటకు పైగా సమయం కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా వారికి ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ వంటకాలతో తేనీటి విందు ఇచ్చారు. ఈ భేటీలో ప్రధాని మోదీ, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను ఆప్యాయంగా పలకరించారు. వారి మధ్య ఉన్న సాన్నిహిత్యం మరోసారి స్పష్టంగా కనిపించింది. ఇది కేవలం టీడీపీ-బీజేపీ రాజకీయ బంధం మాత్రమే కాదని, ప్రధాని మోదీకి, నారా కుటుంబానికి మధ్య బలమైన వ్యక్తిగత అనుబంధం ఉందని ఈ సంఘటన నిరూపిస్తోందని టీడీపీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోదీ, నారా లోకేష్ మధ్య మొదటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో అనేక సందర్భాల్లో లోకేష్ పనితీరును, నాయకత్వ లక్షణాలను ప్రధాని బహిరంగంగానే ప్రశంసించారు. ఎన్నికల సమయంలో కూటమి సభల నిర్వహణ బాధ్యతలను లోకేష్ సమర్థంగా నిర్వర్తించడాన్ని మోదీ గుర్తించి అభినందించారు. అంతకుముందు కూడా విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను విజయవంతం చేసినందుకు లోకేష్‌ను కొనియాడారు. "గతసారి చూసినప్పటి కంటే బరువు తగ్గావు లోకేష్" అంటూ ఒక సభలో ప్రధాని వ్యాఖ్యానించడం వారి మధ్య ఉన్న చనువుకు నిదర్శనం. ఈ అనుబంధంతోనే గతంలో నారా లోకేష్‌ను కుటుంబసమేతంగా ఢిల్లీలోని తన నివాసానికి ప్రధాని మోదీ ప్రత్యేకంగా ఆహ్వానించారు. లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో దాదాపు రెండు గంటల పాటు గడిపారు. ఆ భేటీలో దేవాన్ష్‌ను ఒడిలో కూర్చోబెట్టుకుని ప్రధాని ఆప్యాయంగా మాట్లాడారు. లోకేష్ తన పాదయాత్ర విశేషాలతో రూపొందించిన 'యువగళం' కాఫీ టేబుల్ బుక్‌ను ప్రధాని చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. తాను గురువుగా భావించే మోదీ మార్గదర్శకత్వంలోనే ముందుకు సాగుతానని లోకేష్ పలు సందర్భాల్లో చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో 'డబుల్ ఇంజన్ సర్కార్' వేగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఈ బంధం కీలకంగా మారుతోంది.



## అనుమతుల్లేని స్కూళ్ల పై హెచ్చరికలేన..
# చర్యలు ఎక్కడ?

చిన్నారులతో తరగతులు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతులు పూర్తిగా లేకపోయినా, భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా, స్కూల్ యాజమాన్యాలు మాత్రం ఎలాంటి భయం లేకుండా వ్యవహరిస్తుండడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు వార్తలు ప్రచురితమైనా, స్థానికులు ఫిర్యాదులు చేసినా, సంబంధిత శాఖలకు సమాచారం అందించినా ఇప్పటివరకు గట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో "అధికారుల హెచ్చరికలు కేవలం కాగితాలకే పరిమితమా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కూకట్‌పల్లి మండలంలోని ప్రైవేట్ స్కూల్స్‌కు వరుస నోటీసులు, హెచ్చరికలు జారీ చేస్తూ హడావుడి చేస్తున్న విద్యాశాఖ అధికారులు. కుత్బుల్లాపూర్ మండలం పరిధి గాజులరామారం లోని మట్కెంగూడలో నిర్మాణంలోనే నడుస్తున్న అర్బన్ ఇంటర్నేషనల్ స్కూల్ విషయంలో మాత్రం ఎందుకు కళ్లు మూసుకున్నారన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. భవనం ఇంకా పూర్తి కాలేదుడ పై అంతస్తుల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయిడ అయినా అదే భవనంలో విద్యార్థులతో తరగతులు, అడ్మిషన్లు నిర్భయంగా కొనసాగుతున్నాయి. సాధారణ ప్రజలకు కూడా స్పష్టంగా కనిపిస్తున్న ఈ పరిస్థితి విద్యాశాఖ అధికారులకు కనిపించడం లేదా? లేక కనిపించినా ఉద్దేశపూర్వకంగా మౌనం పాటిస్తున్నారా? అని స్థానికులు నిలదీస్తున్నారు. ఒకవైపు "అనుమతులు లేకుండా స్కూల్స్ నడిపితే సీజ్ చేస్తాం" అంటూ చిన్న స్కూల్స్ ను హెచ్చరిస్తున్న అధికారులుడ మరోవైపు నిర్మాణంలో ఉన్న భారీ ప్రైవేట్ స్కూల్ పై ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం వెనుక అసలు కారణం ఏమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**నిర్మాణంలో ఉన్న భవనాల్లోనే తరగతులు..**నిర్మాణంలో ఉన్న భవనాల్లో చిన్నారులను చదివించడం ఎంత ప్రమాదకరమో తెలిసినా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉన్నాయా? భవనం స్థిరత్వ ధృవపత్రం ఉందా? ఆక్యుపెన్సీ అనుమతి తీసుకున్నారా? అత్యవసర పరిస్థితుల్లో రక్షణ ఏర్పాట్లు ఉన్నాయా? వంటి కీలక అంశాలపై ఎలాంటి స్పష్టత లేకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత శాఖలు మాత్రం చూస్తూ చూడనట్టుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వ నిబంధనలు సాధారణ ప్రజలకు మాత్రమేనా..?** ప్రభుత్వ నిబంధనలు సాధారణ ప్రజలకు మాత్రమేనా? ప్రభావశీల ప్రైవేట్ పాఠశాలలకు వర్తించవా? రాజకీయ అండదండలు ఉంటే చట్టాలు అమలు కావా? అనే ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ, జీహెచ్ఎంసీ, ఫైర్ శాఖలు మేల్కొని తక్షణ చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో జరిగే ఏ ప్రమాదానికైనా పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై విజిలెన్స్ లేదా ఉన్నతస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణ ప్రజలను గమనిస్తున్నాను... ఈసారి వచ్చేది బీజేపీనే: ప్రధాని మోదీ

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ భారీ బహిరంగ సభ**

**తెలంగాణలో భారీ మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్న మోదీ**

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని వ్యాఖ్యలు**

**పశ్చిమ బెంగాల్ చారిత్రక విజయం ఇక్కడ కూడా ఉత్సాహం నింపిందని వెల్లడి**

**కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 'ఎంఎంసీ'గా మారిందంటూ తీవ్ర విమర్శలు**

తెలంగాణలో తదుపరి ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని, వారి కుటుంబ రాజకీయాలతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, అందుకే మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని పశ్చిమ బెంగాల్ ఎన్నికల విజయంతో ప్రారంభించారు. "నిన్న నేను బెంగాల్‌లో ఉన్నాను. అక్కడ తొలిసారి బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. భారీ మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది" అని గుర్తుచేశారు. ఈ చారిత్రక విజయం పట్ల ఉత్సాహం ఇక్కడ తెలంగాణలో కూడా కనిపిస్తోందని, ప్రతి బీజేపీ కార్యకర్తలో నూతనోత్తేజం ఉప్పొంగుతోందని అన్నారు. దేశం నలుమూలలా బీజేపీపై ప్రజల ఆశీస్సులు నిరంతరం పెరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ అభివృద్ధి, సుపరిపాలన నమూనాకు ప్రజలు పదేపదే మద్దతు ఇస్తున్నారని చెప్పారు. బెంగాల్‌లో కేవలం రాజకీయ పార్టీలు గెలవడం, ఓడిపోవడం జరగలేదని మోదీ అన్నారు. అక్కడి ప్రజలను ఒకరకంగా బానిసత్వపు సంకెళ్లలో బంధించిన రాజకీయాలను ప్రజలు ఓడించారని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ అవినీతిని పెంచిందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించిందని, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కూడా కాంగ్రెస్ నుంచే ఈ చెడులన్నింటినీ నేర్చుకుందని, వామపక్షాల చెడు అలవాట్లను కూడా అలవర్చుకుందని విమర్శించారు. ఇలాంటి భయంకరమైన రాజకీయ నియంతృత్వ నమూనాను బెంగాల్ ప్రజలు ఓడించారని, అందుకే దేశవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్నాయని తెలిపారు. "ఈ దేశ రాజకీయాల్లో వస్తున్న మార్పునకు ఇది సంకేతం. ప్రజలు ఇప్పుడు కుటుంబ పాలన కంటే విశ్వాసాన్ని ఎంచుకుంటున్నారు" అని మోదీ అన్నారు. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధించిందని, పుదుచ్చేరిలో కూడా బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. "ఈ విజయాల తర్వాత తెలంగాణ ప్రజల మనోభావాలను నేను గమనిస్తున్నాను. ఈసారి తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వమే" అని అందరూ అంటున్నారని తెలిపారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు, ఆ ఇద్దరిలో ఒకరిని అందించిన గడ్డ తెలంగాణ అని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలోని ఎంపీలలో దాదాపు సగం మంది బీజేపీ వారేనని తెలిపారు. తెలంగాణ ప్రజలు, రాష్ట్ర బీజేపీ కార్యకర్తలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దేశాన్ని విడదీసే విభజన, ద్వేషపూరిత రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వామపక్ష పార్టీల కంటే వామపక్షంగా... అంటే, పక్కా వక్రీకరించిన మావోయిస్టుగా మారింది. ముస్లిం లీగ్ కంటే కరడుగట్టిన ముస్లిం లీగర్‌గా తయారైంది. అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని 'ఎంఎంసీ' అని పిలుస్తున్నారు, అంటే ముస్లిం లీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ అని అర్థం" అని వివరించారు. ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోవడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ప్రధాని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో కాంగ్రెస్ తన వాగ్దానాలను మరచిపోయిందని, ఇప్పుడు తెలంగాణలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటున్నప్పటికీ, మావోయిస్టులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. అభివృద్ధి చెందిన భారత్‌తో సమానంగా తెలంగాణ, హైదరాబాద్ కూడా పురోగమించేలా చూడటమే తమ ప్రయత్నమని, అందుకోసం వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే అవకాశం లభించిందని తెలిపారు.

## తమిళనాడు అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా కరుప్పయ్య

తమిళనాడు అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎమ్మెల్యే ఎం.వి. కరుప్పయ్య నియమితులయ్యారు. సోమవారం నాడు, కొత్తగా ఎన్నికైన సభ సమావేశం కానున్న నేపథ్యంలో, ఈ నియామకం జరిగింది. గతంలో అన్నాడీఎంకేలో కీలక నేతగా ఉన్న ఆయన, ఆ పార్టీలో ప్రాధాన్యత తగ్గడంతో ఈ ఏడాది ప్రారంభంలో విజయ్ నేతృత్వంలోని టీవీకేలో చేరారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, దశాబ్దాల డీఎంకే, అన్నాడీఎంకే ఆధిపత్యానికి తెరదించింది. ఆదివారం ఉదయం చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రిగా విజయ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విజయ్.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, "సింగా పెన్" ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు, మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక విభాగం ఏర్పాటుకు సంబంధించిన మూడు కీలక ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. ఈ పరిణామాల మధ్య, చోళవందాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అయిన కరుప్పయ్యను ప్రొటెం స్పీకర్‌గా నియమించారు. ఆయన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించడంతో పాటు, సభ తొలి సమావేశాలను పర్యవేక్షిస్తారు. 1980 నుంచి అన్నాడీఎంకేలో ఉన్న కరుప్పయ్య, 2011లో ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే, 2016, 2021 ఎన్నికల్లో టికెట్ లభించకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. ఈ క్రమంలో టీవీకేలో చేరారు. 2026 ఎన్నికల్లో టీవీకే అభ్యర్థిగా చోళవందాన్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

## అమెరికాలో తెలంగాణ టెక్కీ హఠాన్మరణం

అమెరికాలోని తెలుగు సమాజంలో విషాదం చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. గద్వాల పట్టణానికి చెందిన జి. సునీల్ కుమార్ (51) ఫ్లోరిడాలోని టాంపా నగరంలో నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆయన తన నివాసం ఆవరణలోనే ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. వివరాల్లోకి వెళితే, సునీల్ కుమార్ ఓ ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్లపాటు చెన్నైలో పనిచేసిన ఆయన, మెరుగైన అవకాశాల కోసం మూడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లారు. ఇటీవలే ఆయన మరో కంపెనీకి మారినట్లు ఆయన చిన్ననాటి స్నేహితులు తెలిపారు. సునీల్ కుమార్ హఠాన్మరణ వార్త తెలియగానే గద్వాలలోని ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. అమెరికాలోని ఆయన స్నేహితులు, తెలుగు సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# క్రమబద్ధీకరణతోనే ఆస్తికి పూర్తి చట్టబద్ధత

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**ముగిసిన ఎల్ఆర్‌యస్ మేళా..**

**4 రోజులపాటు నిర్వహణ**

**110 మందికి అప్రూవల్ ప్రొసీడింగ్స్.. రూ.98.56 లక్షల ఫీజుల వసూళ్లు**

**ప్రతి శుక్రవారం ఎల్ఆర్‌యస్ మేళా నిర్వహించబడును**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో.....** అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడం ద్వారా ఆస్తులకు పూర్తి చట్టబద్ధత లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ప్రజలకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పిస్తూ, పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలతో కలిసి నిర్వహించిన ఎల్ఆర్‌యస్ మేళా ఆదివారంతో ముగిసింది. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ భవనంలో కమిషనర్ చల్లా ఓబులేసు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి అప్రోవల్ ప్రొసీడింగ్స్ అందజేశారు.



నాలుగు రోజులపాటు నిర్వహించిన ఈ మేళాలో విశేష స్పందన లభించిందని కమిషనర్ తెలిపారు. మేళా ద్వారా 110 మందికి అప్రూవల్ ప్రొసీడింగ్స్ జారీ చేయగా, రూ.98.56 లక్షల మేర ఫీజులు వసూలైనట్లు వెల్లడించారు.నగర పరిధిలో మొత్తం 2,902 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు 865 దరఖాస్తులు ఆమోదించబడినట్లు తెలిపారు. మరో 565 దరఖాస్తులకు షార్ట్‌ఫాల్ సమాచారం, 426 దరఖాస్తులకు చెల్లింపు సమాచారం అందజేసినట్లు పేర్కొన్నారు.ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్లకు చట్టబద్ధత లభించడం వల్ల భవిష్యత్తులో రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు పొందడం, ఆస్తి బదలాయింపు వంటివి సులభమవుతుందని కమిషనర్ వివరించారు. క్రమబద్ధీకరణ చేయించుకోని ప్లాట్లపై భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రజల సౌకర్యార్థం ఇకపై ప్రతి శుక్రవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఎల్ఆర్‌యస్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలతో హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

## పరుపుల దుకాణం లో అగ్నిప్రమాద ఘటన బాధాకరం.

**30 లక్షలు విలువ చేసే పత్తి,పరుపులు,సామాగ్రి కాలిపోవడంతో తీవ్ర నష్టం.**

**కొందరి ఆనందానికి...కొందరి బతుకులు రోడ్డున పడ్డాయి.**



**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో కొందరు ఆనందం,మరి కొందరి జీవితాలు రోడ్డున పడ్డాయని,పరుపుల దుకాణం అగ్నిప్రమాద ఘటన బాధాకరమని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు.నంద్యాల పద్మావతి నగర్‌లో ఇటీవల జరిగిన పరుపుల దుకాణం అగ్నిప్రమాద ఘటన బాధాకరమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారు పేర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.20 నుంచి 30 లక్షల విలువైన పరుపులు, పత్తి మరియు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమవడంతో బాధిత కుటుంబం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారు ప్రమాదానికి గురైన దుకాణాన్ని సందర్శించి బాధితుడు దూదేకుల దస్తగిరి తో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకుని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున గానీ, తెలుగుదేశం పార్టీ తరఫున గానీ తగిన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాల మరియు ఓ హోటల్ వద్ద జరిగిన టపాకాయల సంబరాల కారణంగానే ఈ అగ్నిప్రమాదం సంభవించిందని ఆరోపించారు. ముందుగానే టపాకాయలు కాల్చవద్దని వేడుకున్నప్పటికీ పట్టించుకోలేదని, నిప్పురవ్వలు దుకాణంలో పడటంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయని వాపోయారు. “వారి ఆనందం కోసం నా జీవితం బుగ్గిపాలైంది” అంటూ బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మే 11వ తేదీన ( సోమవారం) ఉదయం 9-30 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం

**అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక**

**అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు**

**జిల్లా ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** ఈ నెల 11వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటలకు కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఇంచార్జి కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.

## వెంగళరెడ్డి పేట గ్రామంలో నిర్వహించే ప్రతిష్ఠ మహోత్సవానికి 10,000/-విరాళం



**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక )** శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం వెంగళరెడ్డి పేటలో నిర్వహించే ప్రతిష్ఠ మహోత్సవానికి 10 వేలు విరాళం ఇచ్చినట్టు నంద్యాల 38 వార్డ్ వైఎస్సార్ నగర్ టీడీపీ ఇంచార్జ్,బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కొండ బుగ్గ రాముడు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల పరిధిలోని వెంగళరెడ్డి పేట గ్రామం నందు గణపతి, రాములమ్మ, పోతురాజు వారి ప్రతిష్ట మహోత్సవం ఈనెల 11వ తేదీన అనగా సోమవారం రోజున జరుగుతున్నది.ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ టీడీపీ నాయకులు తోట శివయ్య గారు , గ్రామస్తులు కలిసి నంద్యాల 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ టీడీపీ ఇంచార్జి, బేడా బుడగజంగాల రాష్ట్ర అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు గారిని సగౌరవంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ గణపతి, రాములమ్మ, పోతురాజు వారి ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానానికి తనను ఆహ్వానించిన గ్రామస్తులకు,కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక మంత్రి వర్యులు చీ.వీ.ఎ.ఫరూక్ ఆదేశాల మేరకు 12వ తేదీ అనగా మంగళవారం నిర్వహించే ఒంగోలు జాతి రాష్ట్ర స్థాయి వృషభరాజుల పోటీలకు రెండు పండ్ల విభాగం నాల్గవ బహుమతికి తన వంతుగా 10,000/-రూపాయలు నగదు ఆలయ కమిటీ వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ టీడీపీ నాయకులు తోట శివయ్య, తాటికొండ మహేష్ బాబు, ఆరవీటి బాబు, తెలుగు వెంకటేశ్వర్లు, యడవల్లి రాము తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎన్యూమరేట్లకు ప్రజల సహకారం కీలకం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు నంది పత్రిక బ్యూరో...** నగర పరిధిలో జనగణనలో భాగంగా తొలి విడతగా ఇంటిగణన చేపట్టడానికి ప్రజల వద్దకు వస్తున్న ఎన్యూమరేట్లకు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. ఆదివారం ఆయన కింగ్ మార్కెట్, ఖండేరి వీధి ప్రాంతాల్లో ఇంటిగణన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి జనగణన ఎంతో ముఖ్యమని, రాబోయే పదేళ్ల కాలానికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనకు ఇది ఎంతో అవసరమన్నారు. నగర పరిధిలో 911 మంది ఎన్యూమరేట్లు ఇంటిగణన నిర్వహిస్తున్నారని, వారిని 151 మంది సూపర్వైజర్లు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. నగర పరిధిలో ఇప్పటివరకు 35.07 శాతం జనగణన పూర్తై రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని, మే 31 లోపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందన్నారు.ఇళ్ల వద్దకు ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు స్వీయ గణనలో పాల్గొన్న వారు ఎస్ఈఐడి నంబర్ ఇవ్వాలని, స్వీయ గణనలో పాల్గొనని వారు ఎన్యూమరేటర్లు అడిగిన వివరాలు అందించాలని సూచించారు. ఆధార్ నంబర్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు వంటి సమాచారాన్ని ఎన్యూమరేటర్లు అడగరని స్పష్టం చేశారు. సిబ్బంది తప్పనిసరిగా ఐడి కార్డులు ధరించి ఉంటారని, అనుమానం ఉన్నప్పుడు ఐడి కార్డులు పరిశీలించాలని సూచించారు.ప్రజలందరూ బాధ్యతతో సహకారం అందించాలని, త్వరితగతిన ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలుద్దామని కమిషనర్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

**ఈ నెల 11 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**జిల్లా,డివిజన్,మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

**ప్రతి సోమవారం ఉదయం 9.30 నుంచి ఉ.10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్**

**ఫోన్ చేయవలసిన ల్యాండ్ లైన్ నెం.08562-244437**

**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - డిఆర్ఓమల్లికార్జునుడు**

**వై ఎస్ ఆర్ కడప,బ్యూరో చీఫ్ మే10నంది పత్రిక** ఈ నెల 11 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని డి ఆర్ ఓ మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా,లేదా తమ ఫిర్యాదులకుసంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11 వతేదీన సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ నందు ప్రజాసమస్యలపరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని,ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లాఅధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం లో తమ వివరాలతో పాటు వారి సమస్యలకుసంబంధించి అర్జీలను అంద జేయాలన్నారు.అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పునుతీసుకురావాలని సూచించారు.సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని,అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు,ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలుపిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ ఎస్ ) అర్జీల స్వీకరణ కార్య క్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.లి అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారులి **డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం:** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి ఉ.10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు

## నేడు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

**వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు**



**నంద్యాల బ్యూరో, మే 10(నంది పత్రిక):-:-** జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ నెల 11వ తేదీ (సోమవారం)న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా సమర్పించడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో కూడా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందన్నారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉ.9:30 గంటలకే నగరపాలక పిజిఆర్‌యస్

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు నంది పత్రిక బ్యూరో....** కర్నూలు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’ (పిజిఆర్‌యస్) కార్యక్రమాన్ని ఉదయం 09:30 గంటలకే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇకపై ఈ కార్యక్రమం ఉదయం 09:30 గంటలకే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పిజిఆర్‌యస్ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరవుతారని చెప్పారు.కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని సూచించారు.ప్రతి ఫిర్యాదును స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.



# దేశ చరిత్రలో తొలిసారిగా ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో "తాలీం-ఏ-హునర్" కార్యక్రమం





## పేద ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్య, ఐఐటీ నీట్ కోచింగ్ రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన 3 రోజుల్లో 5 వేలకుపైగా దరఖాస్తులు మే 12 చివరి తేదీ సద్వినియోగ పరచుకోండి: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి..

**వెలుగోడు, మే 10 (నంది పత్రిక):** దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "తాలీం-ఏ-హునర్" (వక్ఫ్ ఎడ్యుకేషన్ మిషన్ ) పేద మరియు ప్రతిభావంతులైన ముస్లిం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ కార్యక్రమం విద్యారంగంలో ఒక చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన మూడు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు, కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ఒక పేద కుటుంబంలో విద్యా దీపం ఆ కుటుంబ భవిష్యత్తుతో పాటు సమాజ భవిష్యత్తును కూడా మార్చగలదని పేర్కొన్నారు. "తాలీం-ఏ-హునర్" కార్యక్రమం ద్వారా ఎంపికైన విద్యార్థులకు పూర్తిగా ఉచిత రెసిడెన్షియల్ డిగ్రీ ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఐటీ-జేఈఈ, నీట్, ఎమ్సెట్ పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందించబడుతుంది. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసి దేశ స్థాయి పోటీల్లో రాణించేలా అత్యున్నత ప్రమాణాలతో శిక్షణ అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ మొహమ్మద్ ఫరూక్ సహకారంతో ఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. అని బుడ్డ రాజశేఖర్ రెడ్డి అన్నారు. 2026 27 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే టాలెంట్ టెస్ట్ ద్వారా పూర్తిగా మెరిట్ ఆధారంగా 250 మంది విద్యార్థులను ఎంపిక చేయడానికి 6 మందిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో బాలికలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం వల్ల ప్రభుత్వం మహిళా విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నది అని. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు స్వీకరణకు మే 12, 2026 చివరి తేదీ మాత్రమేనని, అర్హత కలిగిన విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే. బుడ్డా రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శేషి రెడ్డి, యుగంధర్ రెడ్డి, మైనారిటీ నాయకులు నూర్ బేగ్, పిర్ టైమ్స్ కబీర్ పాల్గొన్నారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు "తాలీం-ఏ-హునర్" కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ నేడు వెలుగోడు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌తో పాటు పలు విద్యాసంస్థలను నాయకులు సందర్శించి. విద్యార్థులకు కార్యక్రమం విశేషాలు, ఉచిత విద్యా సౌకర్యాలు, పోటీ పరీక్షల కోచింగ్, దరఖాస్తు విధానం గురించి తెలుపుతూ. దరఖాస్తు స్వీకరణకు మే 12, 2026 చివరి తేదీ మాత్రమేనని, అర్హత కలిగిన విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే,ఏపీ వక్ఫ్ బోర్డ్ తాలీం - ఏ-హునర్ అప్లికేషన్ పోర్టల్

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నాయకులు. కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త అన్నారపు శేషిరెడ్డి, వెలుగోడు మండల టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ కలాం, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, పట్టణ అధ్యక్షులు మోమిన్ రసూల్, యూనిట్ ఇంచార్జ్ హిదాయత్ అలీఖాన్, ఆసార్ వజీర్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాస్థాయి టీమ్ ఓపెన్ అండ్ ఉమెన్ చెస్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రారంభించిన జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27వ తేదీన బాపట్లలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.**



**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కే నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో మెన్ & ఉమెన్ పోటీలు వేరువేరుగా నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వాహనలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి బోర్డుపై పావులు కదిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కృష్ణ సాయి రోహిత్ మరియు నారాయణ రెడ్డి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ లు పాల్గొన్నారు. డాక్టర్ జి రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ చదరంగం క్రీడ ఏకాగ్రతను ఇనుమడింపచేస్తుందని తద్వారా చదువు లో కూడా రానిచడానికి అవకాశలు అధికమవుతాయి అని అన్నారు. నంద్యాల పట్టణం నుండి ఇంటర్నేషనల్ రేటింగ్ తెచ్చుకున్న మొదటి బాలిక శాలిని ని మెమొంటోతో సత్కరించారు. నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈరోజు జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు బాపట్లలో జరుగుతున్న రాష్ట్ర పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కర్రస్పాండెంట్ కృష్ణ సాయి రోహిత్ మరియు నారాయణ రెడ్డి బ్యాంక్ మేనేజర్ టోర్నమెంట్ ఆర్బిటర్ సుజాత, 100 మంది క్రీడాకారులు వారి తల్లిదండ్రులు చెస్ కోచ్ లు పాల్గొన్నారు

# శ్రీ కేదారేశ్వరి దేవి అన్నదాన సత్రం గదుల ప్రారంభోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని శ్రీ కేదారేశ్వరి దేవి సమేత శ్రీ ప్రమధనందీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా నూతనంగా నిర్మించిన "శ్రీ కేదారేశ్వరి దేవి అన్నదాన సత్రం గదుల" ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆదివారం నంద్యాలలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం నిర్మించిన ఈ గదుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 15వ తేదీ శుక్రవారం శ్రీ ప్రమధనందీశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 8:30 గంటలకు ఘనంగా నిర్వహించబడుతుందని తెలిపారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో దాతల సహకారం అభినందనీయమని ఆయన కొనియాడారు. శ్రీ ప్రమధనందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చలం బాబు మాట్లాడుతూ ఈ గదుల నిర్మాణానికి సహకరించిన శ్రీ ప్రమధనందీశ్వర స్వామి భక్తులకు మరియు దాతలకు నా తరపున మరియు ఆలయ కమిటీ వారి తరపున ధన్యవాదాలు తెలిపారు. భక్తులందరూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఉర్దూ భాష మన సాంస్కృతిక గుర్తింపు...





## ఉర్దూ నేర్చుకోండి మరియు ఇతరులకు కూడా నేర్పించండి.... అల్-హాజ్ ఎన్ఎండి ఫరూక్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు

**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక )** ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షిబ్లీ అధ్యక్షతన స్థానిక టిడిపి కార్యాలయం లో ఈరోజు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్-హాజ్ ఎన్ఎండి ఫరూక్ చేతుల మీదుగా ఉర్దూ నేర్చుకునే అభ్యర్థులకు ఉర్దూ అకాడమీ ముద్రించిన "రండి ఉర్దూ నేర్చుకుందాం" పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్-హాజ్ ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఉర్దూ భాష మన సాంస్కృతిక వారసత్వం అని, అది సంస్కృతిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఉర్దూ నేర్చుకున్న వారు ఇస్లామిక్ విషయాలను స్వయంగా చదివి తెలుసుకోగలరని చెప్పారు. వక్ఫ్ బోర్డు ప్రవేశపెట్టిన "తాలీమ్ హునర్" విద్యా కార్యక్రమం ద్వారా ముస్లిం విద్యార్థులు ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫరూక్ షిబ్లీ మాట్లాడుతూ ఈ వేసవిలో రాష్ట్ర స్థాయిలో వివిధ నగరాల్లో ఉర్దూ అకాడమీ తరపున "రండి ఉర్దూ నేర్చుకుందాం" పేరుతో ఉచితంగా ఉర్దూ నేర్చుకునే అవకాశాలు కల్పించబడ్డాయని తెలిపారు. ఇందులో భాగంగా నంద్యాల నగరంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఫంక్షన్ హాల్ దగ్గర, నబీ నగర్ మరియు కానాల, అయ్యాలురు, గాజులపల్లిలో "రండి ఉర్దూ నేర్చుకుందాం" తరగతులు ఏర్పాటు చేయబడ్డాయి అని తెలిపారు . ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపన మరియు కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపన గురించి ప్రస్తావించారు. అలాగే చంద్రబాబు నాయుడు గారి ఉర్దూ సేవలకు గాను ఆయనను "మొహ్సిన్-ఎ-ఉర్దూ"గా ఉర్దూ లోకం గుర్తు పెట్టుకుంటూందని తెలుపారు.. ఈ కార్యక్రమంలో స్థానిక ఉర్దూ కార్యకర్త మరియు ఉర్దూ అకాడమీ లిటరరీ కమిటీ సభ్యుడు సి. అబ్దుల్ అజీజ్ గారి సేవలను కొనియాడుతూ ఆయనను బాధ్యతాయుతమైన వ్యక్తిగా అభివర్ణించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, టీడీపీ సీనియర్ నాయకుడు మరియు ప్రముఖ డాక్టర్ బాబన్ , మజ్లిస్-ఎ-ఉలమా వ అయిమ్మా నంద్యాల జిల్లా అధ్యక్షుడు హాఫిజ్ అంజద్ బాషా సిద్దిఖీ, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు షమీమ్ బాను, జిల్లా నాయకుడు ముఖ్తార్ బాషా, సమగ్ర శిక్షా అరబిక్ మదర్సా సంఘం నాయకులు ప్రవీణ్ బాజీ, మైమూనా బాజీ, ఉర్దూ సీఆర్పీ నవాజ్ బాషా మరియు పెద్ద సంఖ్యలో ఉర్దూ నేర్చుకునే విద్యార్థులు పాల్గొన్నారు.

# కడప నగరంలో శాంతిభద్ర లకు విఘాతం కలిగించవద్దు కర్నూలు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్



**కర్నూలు ప్రతినిధి నందిపత్రిక** కడప నగరంలో నిన్న శనివారం జరిగిన ఘటన ప్రజాస్వామ్యానికి మరియు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉండటం చాలా బాధాకరమని కర్నూలు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అభిప్రాయపడ్డారు. సామాజిక ఐక్యతను దెబ్బతీసే చర్యలు ఎవరు చేసినా కఠినంగా ఖండించాల్సిన అవసరం ఉంది. ప్రజల ఆస్తులు, ప్రజా ప్రదేశాలు ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి గానీ హింసాత్మక ఘటనలకు పాల్పడకూడదు. ఈ సందర్భంగా సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం అభినందనీయం. ఘటనకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాము. ప్రజలు శాంతిని కాపాడుతూ, ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సామరస్య వాతావరణాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. సమాజంలో ఐక్యత, సోదరభావం నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఖాజా హుస్సేన్ తెలియజేశారు.

# తిరుపతి లో భూకబ్జా మాఫియా ను అరికట్టాలి

## సిపిఐ నేతల తీవ్ర విమర్శ

**తిరుపతి బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** తిరుపతిలో భూ కబ్జా మాఫియాను అరికట్ట లేక పోవడంతో తిరుపతి నగరంలో ప్రజాస్వామ్యం ఉందా లేక గూండాల రాజ్యం కొనసాగుతుందా అనే అనుమానం కలుగుతుందని తక్షణమే భూకబ్జా దారులను నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో భూ కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించడం జరిగింది . ఈ ధర్నాకు ముఖ్య అతిథులు గా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు,జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ తిరుపతి నగరం రోజురోజుకు విస్తరిస్తున్నది ఈతరణంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు వారి అనుంగులుగా ఉంటున్న చోటా మోటా నాయకులు తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న జాగాలను దౌర్జన్యంగా కబ్జా చేస్తూ అడ్డొచ్చిన వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు అందులో భాగంగానే ఈరోజు తిరుపతి నగరం నడిబొడ్డున శివ జ్యోతి నగర్ లో జర్నలిస్టులకు ఇచ్చిన కాలనీలో ఖాళీగా ఉన్న జాగాలపైన కన్నేసిన కొంతమంది రౌడీ మూకలో దౌర్జన్యంగా కబ్జా చేయాలని చూడడం అత్యంత బాధాకరమన్నారు . తిరుపతి నగరం లో గుంపులు గుంపులు గా జనాన్ని పోగేసి స్థలం యజమానులను తీవ్రంగా ఇబ్బందులు కు గురిచేయడాన్ని సిపిఐ తీవ్రంగా తప్పుపడుతుందన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ గారు తక్షణమే స్పందించి ఇలాంటి భూ కబ్జాదారుల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు తిరుపతి రూరల్ మండలం చెంచులక్ష్మి కాలనీలో 2023లో దళిత ఉద్యోగి గుర్రప్ప అనే వ్యక్తి డబ్బులతో ఓ ఇంటి స్థలం కొనుక్కుంటే ఆ ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకోనీ కుండా నాగ మోహన్ రెడ్డి అనే భూకబ్జా దారుడు విచ్చలవిడిగా దళిత గిరిజన యువకులకు మందు తాగిపిచ్చి గంజాయి మత్తుకు అలవాటు చేయించి అనేకమంది ఇళ్లను కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు కానీ పోలీసులు గాని పట్టించుకోకుండా కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు తక్షణమే తిరుపతిలో ప్రశాంతత నెలకొల్పాలని ఈ రౌడీయిజాన్ని అంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీగా కోరుతున్నాం తిరుపతిలో రౌడీలు గుండాలకు చోటు లేకుండా ప్రజలంతా చైతన్యవంతమై తిరుగుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు మాట్లాడుతున్నారు అధికారులు చెప్తున్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే రాధాకృష్ణ నగర కార్యదర్శి జె విశ్వనాథ్ నగర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్ ఎన్ శివ ప్రవీణ్ కుమార్, మహేంద్ర, ఆర్ వి రమేష్,రామకృష్ణ డాక్టర్ ఆర్ బలరాం చిన్నం కాళయ్య వినయ్ జె నాగరాజు మహిళా సమైక్య నాయకులు రత్నమ్మ విజయ ప్రమీల శ్రీనివాసులు అల్లాబక్షూ రాము, తదితరులు పాల్గొన్నారు.



# డైనోసార్ల కన్నా ముందే.. భూమిపై బస్సు సైజులో రాక్షస జీవి!

డైనోసార్లు భూమిపైకి రాకముందే, వాటికంటే సుమారు 10 కోట్ల సంవత్సరాల క్రితమే ఇక్కడ ఒక రాక్షస జీవి తిరిగేది. అది మరేదో కాదు, దాదాపు కారు సైజులో ఉండే భారీ మిలిపీడ్ (సహస్రపాది... కాళ్ల జెర్రి వంటి జీవి). శాస్త్రవేత్తలు తాజాగా 32.6 కోట్ల సంవత్సరాల నాటి ఈ జీవి శిలాజాన్ని కనుగొన్నారు. ఆర్థ్రోప్లూరా అనే ఈ జీవికి సంబంధించిన ఆసక్తికర వివరాలను వెల్లడించారు. 2018 జనవరిలో ఇంగ్లండ్‌లోని నార్తంబర్లాండ్ తీరంలో ఉన్న హౌయిక్ బేలో ఈ శిలాజం బయటపడింది. ఒక ఇసుకరాతిలో 75 సెంటీమీటర్ల పొడవున్న దాని బాహ్య కవచం (ఎక్సోస్కెలెటన్) భాగాన్ని గుర్తించారు. ఇప్పటివరకు ఆర్థ్రోప్లూరాకు సంబంధించి దొరికిన మూడో శిలాజం ఇది. అంతేకాదు, ఉన్నవాటన్నింటిలో ఇదే అతి పెద్దది, అత్యంత పురాతనమైనది కావడం విశేషం.ల ఈ శిలాజం ఆధారంగా, పూర్తి జీవి సుమారు 8.8 అడుగుల (2.7 మీటర్లు) పొడవు, 50 కిలోల బరువు ఉండేదని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

## చాపిరేవుల లో మహిళల హక్కులు, భద్రత పై అవగాహన సదస్సు.



**నంద్యాల సిటీ బ్యూరో మే 10 ( నంది పత్రిక ).** నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో మహిళలకు హక్కులు,భద్రతపై సి ఐ లు జయరాం,ఈశ్వరయ్య లు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ సార్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా చాపిరేవుల గ్రామం లో ఏర్పాటు చేసినటువంటి మహిళల హక్కులు , మహిళల భద్రత, శక్తి టీం , శక్తి యాప్ లపై ఈరోజు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ జయరాం , తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ సార్ ఈశ్వరయ్య , ఎస్ఐ మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగినది . ఇరువురు సిఐలు పాల్గొని మహిళల కు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ , శక్తి యాప్ లు కూడా మీ యొక్క ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలని ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్న ఈ రోజుల్లో మీరు ఏ తప్పు చేయనప్పుడు ఎవరికి భయపడాల్సిన అవసరం లేదు అన్నారు. మీకు డిజిటల్ అరెస్టు చేస్తామని భయపడి మీ నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు అంటే అది కచ్చితంగా సైబర్ నేరమే మీరు సైబర్ నేరాలకు లోను కాకూడదనుకుంటే మీకు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయకపోవడం మంచిదని వీడియో కాల్స్ చేసిన కూడా మీరు స్పందించకపోవడం మంచిది అనవసరమైన లింకులకు ఓపెన్ చేయకపోవడం మంచిది మరియు చిన్న పిల్లలపై జరుగుతున్న దాడుల గురించి వివరిస్తూ వారిపై ఏదైనా లైంగిక దాడి జరిగినా ఫోక్సోకేసుల్లో 20 సంవత్సరాల జైలు శిక్షలు పడతాయని, చిన్న పిల్లలకు చదువుకునే వయసులో చదివించాలి తప్ప వారికి చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం కూడా చట్ట విరుద్ధ నేరమే ఇలా ఎవరైనా పెళ్లిళ్లు చేస్తారు అని ఇన్ఫర్మేషన్ ఇస్తే వాళ్లకు ఐడెంటి ఎవరికి చెప్పము పెళ్లిళ్లు చేసుకునేవారు, పెళ్లిళ్లు చేసేవారు కూడా శిక్షా అర్హులే నేటి సమాజంలో మహిళ చదువు సమాజ వికాసానికి పనికొస్తుంది చదువుకున్న మహిళల వల్ల ఇల్లు కూడా వృత్తి చెందుతుంది ఏదైనా సమస్యలు ఉంటే పోలీసు నెంబర్ 112 గాని లేదా ఏదైనా సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేయగలరని ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి సఖి వన్ స్టాప్ సెంటర్ లపై కూడా ఏదైనా అవసరం నిమిత్తము జిల్లా హెడ్ క్వార్టర్ కు వచ్చినప్పుడు మీరు ఊరికి పోలేని సమయంలో వన్స్టాప్ సెంటర్ లను ఉపయోగించగలరు అని అవగాహన కల్పించడం జరిగినది మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సార్ జయరాం చాపిరేవుల లో ఏర్పాటు చేసిన అవేర్నెస్ ప్రోగ్రాంలో ఇక్కడికి వచ్చిన మహిళల కు అవగాహన కల్పించడం జరిగినది.

## తమిళనాడు దళపతికి అభినందనలు.. మాదిగ ఉద్యోగుల సమాఖ్య



**బద్వేల్,మే 10 (నంది పత్రిక):** దక్షిణ భారతదేశంలొ తమిళనాడు రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జోసెఫ్ విజయ్ కి బద్వేల్ నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఎంఆర్పిఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల మరియు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బద్వేల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద విగ్రహమునకు పూలమాలవేసి తదనంతరం బాణసంచాలు పేల్చి సంబరాలు జరపడమైనది. విజయ్ గారికి బద్వేల్ నియోజకవర్గం లోని దళితుల ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేయడం జరిగినది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఎర్రబల్లి ఓబయ్య, హనుమంతు వెంకటసుబ్బయ్య, ముండ్లపాటి పిచ్చయ్య, జాల గురవయ్య, అనకర్ల సుందరయ్య, సోమిరెడ్డి పల్లె జయచంద్ర,బాల ఓబన్న, రవి, వీరయ్య, మల్లికార్జున, భాస్కర్, దివాకర్, దిలీపు, ప్రతాపు, మల్లికార్జున, ప్రసాదు, రమణ, కేశవయ్య చంద్ర, పంతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది.

## మహిళా సాధికారతకు సైన్యం అండ.. సరిహద్దులో ప్రత్యేక కేఫ్ ఏర్పాటు

తూర్పు సిక్కింలో భారత సైన్యం ఒక ప్రత్యేకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రఖ్యాత బాబా హర్భజన్ సింగ్ మెమోరియల్ టెంపుల్ సమీపంలో, సముద్ర మట్టానికి 13,000 అడుగుల ఎత్తులో పూర్తిగా మహిళలే నిర్వహించే కేఫ్‌ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించింది. మహిళా సాధికారత, సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశం అని అధికారులు తెలిపారు. గౌహతిలోని డిఫెన్స్ పబ్లిక్ రిలేషన్స్ కార్యాలయం ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, త్రిశక్తి కోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యాటకాన్ని, సామాజిక-ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు సైన్యం చేపట్టిన 'రణభూమి దర్శన్' కార్యక్రమంలో భాగంగా ఈ కేఫ్‌ను ప్రారంభించారు. ఈ కేఫ్‌ను పూర్తిగా స్థానిక మహిళా బృందం నిర్వహిస్తుంది. దీనివల్ల మారుమూల పర్వత ప్రాంతాల్లోని మహిళలకు జీవనోపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. బాబా హర్భజన్ సింగ్ ఆలయాన్ని సందర్శించే పర్యాటకులకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కఠినమైన భూభాగం, వాతావరణ పరిస్థితులు ఉండే ఇలాంటి ప్రాంతాల్లోని మహిళల్లో స్వావలంబన, వ్యవస్థాపక స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ చొరవ పర్యాటక ప్రోత్సాహాన్ని జీవనోపాధితో అనుసంధానిస్తుందని, స్థానిక ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని సైన్యం తెలిపింది. సరిహద్దు ప్రాంతాల్లో సైన్యం, పౌరుల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని, ఈశాన్య ప్రాంత ప్రజలతో సంబంధాలను బలోపేతం

## అప్పుల బాధతో యువ మెకానిక్ ఆత్మహత్య



**కొత్తపల్లి, మే 10: (నంది పత్రిక)** అప్పుల భారం తట్టుకోలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజమూరి నాగశేషులు కుమారుడు రాజమూరి పుల్లయ్య అలియాస్ ప్రవీణ్ (23) ఇంటర్ వరకు చదువుకున్నాడు. గత ఐదేళ్లుగా ఆత్మకూరు పట్టణంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని ఆదుకుంటున్నాడు. నెలకు రూ.10 వేల వేతనం వస్తున్నప్పటికీ, అటు ఇంటి ఖర్చులు, ఇటు తను చేసిన అప్పులు తీర్చలేక ప్రవీణ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పుల విషయమై గతంలో తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేయగా.. వారు ధైర్యం చెప్పి త్వరలోనే తీర్చేద్దామని నచ్చజెప్పారు. కాగా, శనివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వచ్చిన ప్రవీణ్, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తండ్రి నాగశేషులు లేచి చూడగా, ప్రవీణ్ ఇంట్లో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి ఎస్సై ఆర్. జయశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి.

### రక్తదాన శిబిరమును ప్రారంభిస్తున్న ఎస్సై జయప్ప.



**రుద్రవరం ప్రతినిధి మే 10 (నంది పత్రిక):** రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడిన వారు అవుతారని ఎస్సై జయప్ప అన్నారు. ఆదివారంమండలం లోనినర్సాపురం గ్రామంలో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ మరియు గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రుద్రవరం ఎస్ఐ జయప్ప , రిటైర్డ్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బండారు పెద్ద దస్తగిరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయప్ప మాట్లాడుతూ ఒకరు చేసే రక్తదానం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాలు మరియు రక్తహీనతతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు నిర్భయంగా రక్తదానం చేయాలని, రక్తదానం చేయడం వల్ల ఎలాంటి హానీ ఉండదని చెప్పారు. యువత సామాజిక బాధ్యతతో ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. రిటైర్డ్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ బండారు పెద్ద దస్తగిరి మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అవసరమైన సమయంలో రక్తం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల స్వచ్ఛంద రక్తదానం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత మంది యువత రక్తదానానికి ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలకు నిర్వాహకులు అభినందనలు తెలియజేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమం ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీమ్ అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, నరసాపురం గ్రామ యువకులు చిన్నరెడ్డి, రమణ, ముల్లా మాలిక్ హుస్సేన్, మైసూరు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులలో తెలుగుపై మక్కువ పెంచడం ఎలా

### న్యూక్లియస్ కళాశాలలో ఘనంగా "తెలుగు సాహితీ సదస్సు" ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ రమణమూర్తికి సత్కారం.....

"విద్యార్థులలో తెలుగుపై మక్కువ పెంచడం ఎలా" అనే అంశం పై ఆదివారం నంద్యాల న్యూక్లియస్ జూనియర్ కళాశాలలో చర్చా గోష్టి నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు, మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ సోము మురళీధర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 2026 ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ వైష్ణవ వెంకటరమణమూర్తి గారు పాల్గొన్నారు. నంద్యాల పట్టణానికి చెందిన అనేకమంది ప్రముఖ ఉపాధ్యాయులు , తెలుగు రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొని తెలుగు మనుగడ కోసం, విద్యార్థులు తెలుగును ఆస్వాదించడం కోసం ఏమి చేయాలో సూచనలు సలహాల ద్వారా వినిపించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులకు జానపదాలు, కోలాటం వంటివి నేర్పించాలని, విద్యార్థులను కథలు రాసే విధంగా ప్రోత్సహించాలని, అభిప్రాయపడ్డారు. తెలుగు ఉపాధ్యాయుడు రిసోర్స్ పర్సన్ ఎద్దు ప్రసాదు మాట్లాడుతూ విద్యార్థులు చదివే గ్రూపులతో సంబంధం లేకుండా తెలుగు వాతావరణాన్ని విద్యాలయాల్లో సృష్టించాలని అది విద్యార్థులపై అధిక ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు. బీఈడీ కళాశాల అధ్యాపకులు రచయిత మహమ్మద్ రఫీ మాట్లాడుతూ తెలుగు మాధ్యమ పాఠశాలలను ప్రత్యేకంగా నెలకొల్పాలని, చలనచిత్రాలలో తెలుగు సంస్కృతి ప్రతిబింబించాలని అభిప్రాయపడ్డారు. గుడ్ షెఫర్డ్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రవికుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తెలుగుకు ప్రాధాన్యం ఉండాలని, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు విద్యార్థులకు నిర్వహించాలని, విద్యాలయాల్లో తెలుగు పుస్తకాలతో కూడిన గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. విశ్రాంత ఉపాధ్యాయులు రచయిత నీలకంఠమాచారి మాట్లాడుతూ విద్యార్థులలో శక్తి సామర్థ్యాలను వృథా



కానివ్వకుండా తెలుగు భాష వైపు మళ్ళించాలని, విద్యార్థులను ఉపాధ్యాయుడు తన తెలుగు వాక్చాతుర్యంతో ఆకర్షించాలని అభిప్రాయపడ్డారు. నంద్యాలకు చెందిన ప్రముఖ అవధాని డాక్టర్ గంగుల నాగరాజు గారు మాట్లాడుతూ విద్యాసంస్థలలో ప్రతినెల సాహితీ సంబంధ కార్యక్రమాలు నిర్వహించాలని, తెలుగును రసభరితంగా బోధించాలని, అనేక సబ్జెక్టులు చదివి అలసిన విద్యార్థికి తెలుగు ఆటవిడుపు కావాలని, తెలుగు పాఠం ద్వారా విద్యార్థులు నూతనోత్సాహం నింపుకోగలగాలని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు తెలుగు రచయిత అయిన మాబు బాషా గారు మాట్లాడుతూ యునెస్కో వారు అంతరించిన భాషల డేటా ప్రకారం తెలుగు కూడా త్వరలో అంతరించిపోయే భాష అని పేర్కొన్నారు గాని ఇంట్లో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తెలుగులో మాత్రమే మాట్లాడుతూ, వ్రాయడానికి కూడా తెలుగునే ఎంచుకోగలిగితే తెలుగు శాశ్వతమైన భాషగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. తెలుగు ఉపాధ్యాయులు రచయిత రిసోర్స్ పర్సన్ నరేంద్ర మాట్లాడుతూ తెలుగు భాషకు సంబంధించిన ప్రముఖ వ్యక్తుల జయంతి, వర్ధంతులను నిర్వహించి వారి ప్రత్యేకతను విద్యార్థులకు వివరించాలని అభిప్రాయపడ్డారు. సామాన్య శాస్త్ర ఉపాధ్యాయులు జన విజ్ఞాన వేదిక సభ్యులు రమణ మాట్లాడుతూ తెలుగు భాష ఉన్నతి కోసం సాంకేతికతను వాడాలని, పద్యాలు పాటలను లయబద్ధంగా విద్యార్థులు పాడటాన్ని అలవాటు చేయాలని, తెలుగు కు సంబంధించిన పోటీలు, విద్యార్థులకు తరచు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అనంతరం ముఖ్యఅతిథి డా.రమణమూర్తి గారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు లభించే పురస్కారం తెలుగు లభించిన పురస్కారం గా చూడాలన్నారు. నంద్యాలకు చెందిన కవులందరూ వారు వారి రచనలను పుస్తక రూపంలోకి తెచ్చినప్పుడే నంద్యాల ఘనత ఇతరులకు తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. 74 సంవత్సరాల వయసులో అనారోగ్యంతో శరీరం సన్నబడింది కానీ నా పద్యం సన్న పడలేదని చమత్కరించారు. శ్రోతలను ఆకట్టుకునే విధంగా పద్యం తప్పులేకుండా రాగయుక్తంగా చదవగలిగితే తెలుగు అజరామరంగా వెలుగు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రచయిత , కళాశాల తెలుగు అధ్యాపకులు కొప్పుల ప్రసాదు, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ డైరెక్టర్ వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ సోము మురళీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలుగు ఉన్నతి కోసం ఆర్థికంగా సహాయం చేయడానికి, తమ కళాశాలను వేదికగా ఇవ్వడానికైనా న్యూక్లియస్ కళాశాల ఎప్పుడూ సిద్ధమేనని పేర్కొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా నిరసన.



**బేతంచెర్ల మే 10 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణం లో సిఐటియు ఆధ్వర్యంలో బేతంచర్ల లారీ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ కార్యాలయం నుండి కార్మికులు నిరసనగా భారత్ బేకరీ సర్కిల్ నందు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కార్డులను అమలు చేస్తుందని కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఇప్పుడు ఉండబడిన కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు కార్మిక కోళ్లను అమలుచేసి పనిగంటలను పెంచుతూ కఠినమైన శిక్షలను విధించి కార్మికుల మెడకు ఉరితాడు ఇలాంటి చట్టాలను అమలు చేస్తుంది ఇటువంటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరం ఐకమత్యంగా ఉండి ఉద్యమించాలని ఈ నిరసన కార్యక్రమం జయప్రదం చేయడం జరిగింది ఈ నిరసన కార్యక్రమానికి సిఐటియు సంఘాల నాయకులు పాల్గొన్నారు సిఐటియు అధ్యక్షుడు వా. ఖాజా బాషా లారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి.రామాంజనేయులు భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కె.భాష,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.మద్దిలేటి స్వామి ఆర్.మద్దయ్య,కె.రామకృష్ణ,జె.శ్రీనివాసులు,బి.మహేశ్వర్ రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు వెంకట రామిరెడ్డి ఎస్.హుస్సేన్ భాష,బి.మధు,జి.సురేష్,ఎస్.గని భాష,ఎస్ మహబూబ్ బాషా మరియు కార్మికులు కలిసి నాలుగు లేబర్ కోర్టు జీవో కాపీలను కాల్చి నిరసనగా దగ్ధం చేయడం జరిగింది.




## జిల్లా కేంద్రం లో ఘనంగా ప్రపంచ కార్మిక 140 వ (మే-డే) వార్షికోత్సవాలు

**నంద్యాల బ్యూరో, మే10(నంది పత్రిక):-** కార్మిక దినోత్సవం 140 వ (మే డే) వార్షికోత్సవాలు సందర్భంగా ఆదివారం నంద్యాల పట్టణంలో కార్మిక లోకం ఘనంగా కదంతొక్కింది. సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ మరియు ఏ.ఐ.సీ.సీ.టీ.యూ కిసాన్ మహాసభ ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 140వ మే డే వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. కార్మికులు,కర్షకులు మరియు మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి వార్షికోత్సవాలలో పాల్గొన్నారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి టీ.శీలన్న అధ్యక్షత వహించడం జరిగింది.అనంతరం సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అణిచివేత ధోరణి కొనసాగిస్తుందని అందులో భాగంగానే నాలుగు లేబర్ కోర్టులు తీసుకువచ్చి కార్మికులను అణిచివేయాలి అని దురుద్దేశంతో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని అన్నారు.చికాగో నగరంలో ప్రాణ త్యాగాలతో సాధించుకున్నఎనిమిది గంటల పని విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.నంద్యాల పట్టణంలో పేరుకే నంద్యాల జిల్లా తప్ప జిల్లా కేంద్రంలో మౌలిక వసతులు కల్పించే విషయంలో పాలకులు అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.నంద్యాల పట్టణంలో జనాభా పెరిగిన దానికి అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో మంచినీటి,సమస్య డ్రైనేజీ,రోడ్లు,వీధిలైట్లు, మురికి కాలువలో ఆక్రమణ గురవుతున్న పట్టించుకునే పరిస్థితి లేదన్నారు జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులు,మున్సిపల్ కమిషనర్ గారు సమస్యలను పరిష్కరించాలని తక్షణమే జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని హెచ్చరించారు. లేనిపక్షంలో నంద్యాల పట్టణ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలో భాగంగా మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు రెండు సెండ్ల స్థలము,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఇచ్చినటువంటి హామీ తుంగలో తొక్కారని తక్షణమే వాటిన అమలు చేయాలని ప్రతి మహిళకు నెలకు1500 రూపాయలు అకౌంట్ లో జమ చేస్తామని హామీ ఏమైంది అన్నారు.అదేవిధంగా నిరుద్యోగులకు రూ 3000 నిరుద్యోగి భృతి ఇస్తామని చెప్పినటువంటి హామీలు ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్ మంజూరు చేస్తామని నేటికిని నెరవేర్చలేదన్నారు వీటిని అమలు చేయకపోతే రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వాన్ని కృష్ణానది బ్యాక్ వాటర్లో ప్రజలుముంచుతారని తక్షణమే వీటిని అమలు చేయకపోతే సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ సలాం,టి.నరసింహులు మేకల.చంద్రశేఖర్,కాంతారావు, ఎం.ప్రవీణ్ సతీష్ నాయకులు ఎస్.బీ.బీ,లక్ష్మీదేవి,ముత్తు జాబి,మధు తిమ్మాపురం డి.రమణమ్మ, సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



# ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతున్న "స్టార్ట్ అప్ కడప"..




## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి "స్టార్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతి పరిశీలన

**కడపబ్యూరో చీఫ్ , మే 10 నంది పత్రిక** జిల్లా యువతకు నైపుణ్య నిధిగా, రాష్ట్రానికే స్ఫూర్తిగా రూపుదిద్దుకుంటున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్.. అతి త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం అవుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని పి4 విధానం ద్వారా ఇన్నోవేటీవ్ గా నిర్మిస్తున్న "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. కడప నగర నూతన కమిషనర్ భావన తోకలిసి పరిశీలించారు. బాహ్య నిర్మాణ పనులను పూర్తిగా వారంలోగా కంప్లీట్ చేయాలన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీలేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబందిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆ వెంటనే ఇంటీరియర్ మౌలిక సాధిపయలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆశించే స్థాయి నుండి శాశించే స్థాయికి ఎదగాలంటే ప్రతిఇంటి నుండి ఒక స్టార్ట్ అప్ గా ఎదగాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి జిల్లా యంత్రాంగం చేసిన సూపకల్పన ప్రతి యువతకు ఆదర్శనీయంగా రూపుదిద్దుకుంటోందన్నారు. ఇలాంటి స్టార్ట్ ఆప్ కడప కార్యక్రమాన్ని ఆకాంక్ష జిల్లా కడపలో ప్రప్రథమంగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నాం అన్నారు. ఈ "స్టార్ట్ అప్ కడప" ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సెంటర్.. యువ స్టార్టప్ వ్యవస్థాపకులు, ఫ్రీలాన్సర్లు, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థల అభివృద్ధికి పునాది వేస్తూ, కడపను వ్యాపార అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక పాత్ర పోషించనుందన్నారు.స్టార్టప్ కడప" కేవలం ఒక భవనం మాత్రమే కాదని.. ఇది యువత కలలకు రూపురేఖలు ఇచ్చే వేదిక అన్నారు. ఆవిష్కరణ, ఆధునికత, అభివృద్ధికి దిక్సూచిగా నిలవనుందన్నారు. ఈ కార్యక్రమంలో కెఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, హౌసింగ్ ఇంజనీర్లు, ఏడిపి యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# గడ్డివాము దగ్ధం పై సమగ్ర విచారణ చేపట్టాలి.

## బాధిత రైతుకి నష్టపరిహారం చెల్లించాలి.

## భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) డిమాండ్.



**బేతంచెర్ల మే10 ( నంది పత్రిక ).** బేతంచర్ల మండలం అంబాపురం గ్రామంలో గడ్డివాము దగ్ధమైన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని అంబాపురం గ్రామ సీపీఐ శాఖ నాయకులు శ్రీరాములు, సోమన్న, నాగేశ్వరరావు, చంద్రమోహన్ లు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం గ్రామంలో గ్రామానికి చెందిన సురేంద్రనాథ్ రెడ్డి గడ్డివాము మరియు ట్రాక్టర్ మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైందని, గడ్డివాములో నిల్వ ఉంచిన పశువుల మేత, ఎండుగడ్డి పూర్తిగా కాలిపోయిందని, ప్రమాదంలో భారీ నష్టం సంభవించిందన్నారు. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిబూడిదైందని, అగ్నిప్రమాదంతో నష్టపోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని, ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలనుఏ బహిర్గతం చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు రైతులకు నష్టం చేకూర్చే సంఘటనలపై ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదని కోరారు.

# పకృతి సేద్యము.... ప్రగతికి మార్గము





## ఆదర్శంగా నిలుస్తున్న మహిళ రైతులు

**జూపాడుబంగ్లా: మే :10: (నంది పత్రిక )** ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఎంత సంపాదన ఉన్నా చక్కటి ఆరోగ్యం లేకుంటే వృధా అన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ఆధునిక పరిస్థితుల్లో సాగులో రసాయనక ఎరువుల వినియోగంతో ఆరోగ్యం దెబ్బతింటుంది. మితిమీరిన రసాయన ఎరువులు పురుగుమందులు వాడడం వల్ల ఆరోగ్యం బాలిన పడుతున్నారు. రసాయనగా ఎరువుల వాడడం వల్ల భూమి నిస్సరమైన దిగుబడి తగ్గిపోతుందని గుర్తించిన మహిళ రైతులు పకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రోత్సాహం అందిస్తుంది అన్నారు. పకృతి వ్యవసాయం దేశవ్యాప్తంగా ను, ఆవు పేడ మూత్రాలతో జీవామృతం గణామృతం వంటి సహజ ఎరువులు తయారుచేసి సాగులో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు అన్నారు. పంచగవ్య పిచ్చికారితో పంట ఆరోగ్యంగా పెరగడంతోపాటు చీడపీడలను తట్టుకునే స్వభావం పెరుగుతుంది అన్నారు. రైతులు తమ పొలంలో సులభంగా గుణజీవామృతం తయారు చేసుకొనే విధానం గురించి తెలిపారు. జీవామృతం రెండు రకాలు ఒకటి ఘన జీవామృతం, ఆవు పేడ మూత్రం, పప్పుల పిండి, బెల్లములతో ధ్రువ జీవామృతాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి తయారు చేసుకుని వాడుకోవాలి. ఘనజీవా మృతాన్ని అనుకూలమైన ఎండాకాలంలో తయారు చేసుకోవాలి. భూసారం పెంపుదల లో పశువుల ఎరువు వర్మి కశీపోస్టుకు ఇది చక్కని ప్రత్యామ్నాయము. ఎకరాకు ఏటా 400 కిలోలు వేస్తే చాలు పంటలు బాగా వస్తాయి అన్నారు.ఆరోగ్యంతో పాటు ఆదాయం.. పకృతి సాగులో గణ ధ్రువ జీవామృతం, కాషాయాలు వాడడం వల్ల ఇంతలో నాణ్యమైన దిగుబడులు తో పాటు మంచి ఆదాయం వస్తుంది. మేము నాలుగేళ్లుగా పకృతి వ్యవసాయం చేస్తున్నాం. ప్రస్తుతం రెండు ఎకరాలలో వంకాయ,టమోటా, బంతి, మునగ, బీరకాయలు, కంది పంట సాగు చేస్తున్నాము. అంతర్ పంటలుగా ఏటీఎం విధానము ద్వారా పది రకాల పంటలను సాగు చేస్తున్నాము. పార్వతి 80 బన్నూరు



# ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయండి

## డ్రైనేజ్ కాలువలు ఏర్పాటు చేశారు కానీ సిసి రోడ్డు వేయలేదు..?

## రాబోయే వర్షాకాలంలో ఎస్సీ కాలనీ మురికి కూపం గా మారుతుందని కాలనీవాసుల భయం



**బేతంచెర్ల మే 10 ( నేమధిపత్రిక ).**. త్వరగా సిసి రోడ్ ఏర్పాటు చేయాలని ఎస్సీ కాలనీవాసుల విజ్ఞప్తి బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో, సిసి రోడ్డును ఏర్పాటు చేయాలని, కాలనీవాసులు ఆదివారం విలేకరులకు తెలిపారు. దళిత ప్రజలు మాట్లాడుతూ మా కాలనీలో నూతనంగా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారని,కానీ సీసీ రోడ్డు ఏర్పాటు చేయడం అధికారులు మరిచారని ప్రజలు వాపోతున్నారు.ఇప్పుడు వర్షానికే రోడ్డు నిండా మురికి నీరు చేరుకొని ఇళ్లలోకి వెళ్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆ మురికి నీరు దుర్వాసన వస్తుందని, తద్వారా నానా రోగాలు పాలవుతున్నామని వారు అంటున్నారు.ఏది ఏమైనా ఉన్నతాధికారులు స్పందించి, వర్షాకాలం రాకముందే, మా దళిత కాలనీకి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని,ఎస్సీ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అదుపు తప్పి కారు బోల్తా .. ఆరుగురికి స్వల్ప గాయాలు



**మంత్రాలయం , మే 10,** అదుపు తప్పి కారు బోల్తా పడి ఆరుగురికి గాయాలైన సంఘటన మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు , పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా రాయనహళ్ళి గ్రామానికి చెందిన బసవరాజు ,ఇందన్న చాముండేశ్వరి , బసవరాజప్ప , హారిక ,సాతు కుటుంబ సభ్యులతో రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కెఎ 17 ఎంబి 6526 నెంబర్ గల వాహనంలో మంత్రాలయం వస్తుండగా చిలుకలడోణ గ్రామ సమీపంలో ఓ బండిని తప్పించబోయి వాహనం అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో బసవరాజు ఇంద్రన్న ఛాముండేశ్వరి, బసవరాజప్ప హారిక, సాతులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందారు.

# కడప నగరంలోని అల్మాస్ పేట సర్కిల్ ను పరిశీలించిన కర్నూలు రేంజ్ డీ.ఐ.జి డా. కోయ ప్రవీణ్

**వైయస్సార్ కడప జిల్లా బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** రెండు వర్గాల మధ్య చిన్న ఘటన జరిగిందని, అనుకోకుండా రాళ్ల దాడి , కొంతమంది పోలీస్ సిబ్బంది గాయపడడం జరిగిందని కర్నూలు రేంజ్ డీ.ఐ.జి డా. కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు రేంజ్ డి.ఐ.జి , జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ తో కలిసి కడప నగరంలోని అల్మాస్ పేట సర్కిల్ లో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ స్టోన్ పెల్టింగ్ కు, దాడి చేసిన వాళ్లంతా కొంతమంది అదుపులో ఉన్నారు. మరి కొంత మంది పరారీలో ఉన్నారు. వారి కోసం గాలింపు జరుగుతోంది. ఫ్లాగ్ మార్చ్ కూడా జిల్లా ఎస్.పీ నిర్వహించారని, కర్నూల్ రేంజ్ డి.ఐ.జి డా. కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. భారతదేశానికి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని, హిందువులకు వారి మత విశ్వాసాలు ఎంత ప్రగాఢమైనవో, అలాగే మహమ్మదీయులకు కూడా వారి మత విశ్వాసాలు అంతే ప్రధానమైనవని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఇరు వర్గాల వారిని సమతూకం పాటించి అందరి విశ్వాసాలకు ఎక్కడైతే సమస్య ఉందో సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన బాధ్యత పోలీస్ , రెవెన్యూ యంత్రాంగంపై బాధ్యత ఉందన్నారు. దానికి సామరస్యపూర్వకంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో అందరికి ఆమోదయోగ్యమైన మార్గం లో వెళ్ళాలి తప్పితే ...నా దారి రహదారి అనేది కుదరదనిడి.ఐ.జి శ్రీ డా. కోయ ప్రవీణ్ ఐ.పీ.ఎస్ గారు పేర్కొన్నారు. ఇరు వర్గాలను సముదాయించి మత సామరస్యాన్ని కాపాడతామని తెలిపారు. సెక్షన్ 144 అమలులో ఉండగా ర్యాలీలు నిర్వహించకూడదని, నలుగురికి మించి గుమికూడకూడదన్నారు. వారిని చెదరగొట్టే అధికారం పోలీసులకు చట్టం కల్పిస్తుందన్నారు. అందరిని సముదాయిస్తామని, ఒకరి మత విశ్వాసాలకు మరొకరు అభ్యంతరం కలిగించకుండా వ్యవహరించాలని సూచించారు.



జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ నేతృత్వంలో అల్మాస్ పేట లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్ : అల్మాస్ పేట లో శనివారం ఘటన జరిగిన నేపథ్యంలో ఆదివారం జిల్లా ఎస్.పీ షెల్కే నచికేత్ నేతృత్వంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

# అగ్నికి ఆహుతై కాలి బూడి దైన గడ్డి వాము - ట్రాక్టర్.



**బేతంచెర్ల మే 10 ( నంది పత్రిక ).**ఆదివారం ఉదయంన్నే తెల్లవారుజామున బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామానికి చెందిన సురేంద్ర నాథ్ రెడ్డి గడ్డివాము అకస్మాత్తుగా అగ్నికి ఆహుతైంది.ఈఘటనలో భారీ ఆస్తి నష్టంసంభవించి నట్లుబాధితులుతెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గౌరవనీయులు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సుజాతమ్మబాధితులకు ధైర్యం చెప్పి, ఈ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సుజాతమ్మ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో టిడిపి బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య టిడిపి శ్రేణులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



# మాలల ఆశాజ్యోతి పివి రావు

**బనగానపల్లె మే 10 నందిపత్రిక** మాలల ఆశాజ్యోతి పి. వి రావు అని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి అన్నారు పి వి రావు గారి 78వ జయంతి సందర్భంగా ఆదివారం నాడు బనగానపల్లె పట్టణంలో మాల మహానాడు కార్యాలయంలో పివి రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ 1952 వ సంవత్సరం తూర్పుగోదావరి జిల్లా మార్టూరులో పివి రావు జన్మించారని వృత్తిరీత్యా ఐఏఎస్ ఆఫీసర్ అయిన ఆయన మాల జాతి కోసం ఉద్యోగము సైతం లెక్కచేయకుండా రాజీనామా చేసే మాలల హక్కుల కోసం పోరాటం చేసిన పోరాటయోధుడని చివరకు తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా మాల జాతి కోసం త్యాగం చేశారని ఆయన చేసిన సేవలను కొనియాడారు అందరూ పివి రావు ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు జిల్లా కార్యదర్శి కే శివుడు మలమాలు మండల అధ్యక్షుడు కొత్తపేట నరసింహుడు తదితరులు పాల్గొన్నారు



# పదో శతాబ్దం నాటి అరుదైన విగ్రహాలు లభ్యం ...





**కడప వైఎస్ఆర్ జిల్లా బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** కడప–రాయచోటి రహదారి మధ్య శేషాచల అడవుల్లోని సిద్ధమల్లేశ్వర స్వామి ఆలయానికి ఉత్తర దిశలో గుంటముల చెరువు దగ్గర పదో శతాబ్దం నాటి అరుదైన విరిగిన స్థితిలో ఉన్న ఒక శిరస్సు, స్త్రీ మూర్తి మొండెం , ఒక శైవ మూర్తి విగ్రహాలను గుర్తించి వెలుగులోకి తెచ్చినట్లు మైదుకూరుకు చెందిన రచయిత,చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం మీడియాకు తెలిపారు.

**విగ్రహాల వివరాలు...** శైవ మూర్తి (పాలేటయ్య)... స్థానికులు 'పాలేటయ్య' అని పిలిచే ఈ విగ్రహం పూర్తిగా పుట్ట మట్టిలో కలిసిపోయి ఉందన్నారు. విగ్రహం ఎడమ చేతిలో డమరుకం, తలపై కరండ మకుటం ఉన్నాయని, కుడి చేయి కాలక్రమేణా అంతరించిపోయిందని రమేష్ చెప్పారు. శివ శిరస్సు... ప్రశాంతమైన ధ్యాన ముద్రలో ఉన్న ఒక విగ్రహ శిరస్సు లభించిందని వివరించారు. ఈ తలకు ఎడమవైపున తలక్రిందులుగా ఉన్న త్రిశూలం ఉండటం విశేషమని కళ్లు మూసుకుని ఉన్న ఈ ముఖ కవళికలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు.

**స్త్రీ మూర్తి (యోగిని)...** స్థానికులు 'పాలేటమ్మ'గా పిలిచే ఈ విగ్రహంలో తల భాగం లేదు, కేవలం మొండెం మాత్రమే లభ్యమైందన్నారు. యోగాసనంలో కూర్చుని ఉన్న ఈ మూర్తి, రెండు చేతులను ఉదరంపై ఉంచి యోగ ముద్రలో ఉందని చెప్పారు. చేతులలో ఏముందనేది రాయి అరిగిపోవడం వల్ల స్పష్టంగా తెలియడం లేదని వివరించారు.

**నిపుణుల ధృవీకరణ...** లభ్యమైన శిరస్సు మరియు స్త్రీ మొండెం రెండు వేరువేరు విగ్రహాలకు చెందినవని 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ ధృవీకరించారు. ఇవి పదో శతాబ్దం నాటివని మైసూర్ విశ్రాంత పురావస్తు అధికారి విజయ్ కుమార్, విజయవాడ పురావస్తు అధికారి శివకుమార్ స్పష్టం చేసినట్లు రమేష్ వెల్లడించారు. ఈ విగ్రహాల గురించి చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లి పంచాయితీ లింగారెడ్డి పల్లె నివాసి, సిద్ధమల్లేశ్వర ఆలయాభివృద్ధి వ్యవస్థాపకులు చెన్నంరెడ్డి నాగ మల్లారెడ్డి సమాచారం అందించారని, ఈ ప్రాంతంలో మరిన్ని పరిశోధనలు చేసి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తానని రమేష్ తెలిపారు.

## మే 11న జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహణ

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్ ) కార్యక్రమాన్ని ఈ సోమవారం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజా.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చును. జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అల్పాహారం, భోజనం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## మహానాడు ఏర్పాట్లపై అల్లూరు క్రాస్ రోడ్డు వద్ద ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్ల పరిశీలన.

### .ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి..



**కావలి,బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** నెల్లూరు జిల్లా రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మహానాడుకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరానుండటంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదివారం దగదర్తి మండలం అల్లూరు క్రాస్ రోడ్డు ప్రాంతాన్ని పోలీస్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. మహానాడు సందర్భంగా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ,భద్రతా చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా అల్లూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేలా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు, సూచిక బోర్డులు, బ్యారికేడ్లు వంటి ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా రాత్రి వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. చీకటి ప్రాంతాల్లో తాత్కాలిక హైమాస్ట్ లైట్లు, స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేసి భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు తెలిపారు. మహానాడు రోజుల్లో అల్లూరు క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్‌ను పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.మహానాడుకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరూ సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానానికి చేరుకునేలా పోలీస్ లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, స్థానిక నాయకులు, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్‌పై ఈ రోజు నుంచే పోరాటం: సీఎం విజయ్




**చెన్నై బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ తొలిసారిగా సభను ఉద్దేశించి ప్రసంగించారు. తన జీవితంలో చాలా కష్టాలు అనుభవించానన్న సీఎం విజయ్.. ఆకలి బాధలు అంటే ఏంటో తనకు తెలుసన్నారు. తనను అభిమానంగా పిలిచారు కాబట్టే రాజకీయాల్లోకి వచ్చానని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. 'నేను మీ కుటుంబ సభ్యుడి లాంటి వాడిని. సినిమాల్లో నన్ను ఉన్నతస్థాయిలో నిలిపారు. తమ్ముడూ రా.. అంటూ పిలిచారు కాబట్టే రాజకీయాల్లోకి వచ్చాను. నా ప్రయాణంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా. ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్‌పై ఈ రోజు నుంచే పోరాటం ప్రారంభం' అని సీఎం విజయ్ అన్నారు. ప్రస్తుతం.. తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని విజయ్ తన ప్రసంగంలో వెల్లడించారు. గత ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీ చేసిందని.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు. ఏది సాధ్యమో అది మాత్రమే చేస్తామని.. అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని ముఖ్యమంత్రి వివరించారు. 'దిస్ ఈజ్ న్యూ బిగినింగ్. ప్రజా ధనాన్ని వృథా చేయను.. దోచుకోను. టీవీకేలో ఒకే ఒక అధికార కేంద్రం ఉంది.. అది విజయ్ మాత్రమే. నేను పవర్ సెంటర్.. మరో పవర్ సెంటర్ ఉండదు.. ఉండబోదు. మైనారిటీ ప్రజలకు, విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఉంటా. కార్యకర్తల వల్లే ఈ విజయం సాధ్యమైంది. వారికి రుణపడి ఉంటా. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మిత్రువులైనా, శత్రువులైనా.. అందరికీ ఒకే చట్టం' అని ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు..

## ఈనెల 11వ తేదీ సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ మరియు రెవిన్యూ క్లినిక్ ల నిర్వహణ

### 1100 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు, స్థితి తెలుసుకోవచ్చు



**ఏలూరుబ్యూరో చీఫ్ , మే, 10నంది పత్రిక :** ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈనెల 11వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయిలో యధావిధిగా పిజి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడతాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించిందని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీర్స్ ) సేవలను ఈ నెల 11 వ తేదీ సోమవారం మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చున్నారు.అలాగే, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు, ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్: ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు

## సోమవారం మంత్రి కొలుసు పార్థసారధి ఏలూరు జిల్లాలో పర్యటన

**ఏలూరు, బ్యూరో చీఫ్ మే, 10 నంది పత్రిక :** రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఈనెల 11వ తేదీ ఉదయం 8. 30 ని.లకు విజయవాడ నుండి బయలుదేరి, 9. 30 ని.లకు ఏలూరు చేరుకుంటారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద నిర్మించనున్న జిల్లా టిడిపి పార్టీ కార్యాలయ భవన నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 11 గంటలకు ఏలూరు నుండి బయలుదేరి 11. 30 ని.లకు భీమడోలులోని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఇంటికి వెళతారు. స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు భీమడోలు నుండి బయలుదేరి 2 గంటలకు నూజివీడు చేరుకుని స్థానికంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4. 30 ని.లకు నూజివీడు నుండి బయలుదేరి 5 గంటలకు అగిరిపల్లి చేరుకొని ప్రాధమిక వ్యవసాయ పరపతి సంఘ భవనానికి శంఖుస్థాపన చేస్తారు. అనంతరం 6 గంటలకు అగిరిపల్లి నుండి విజయవాడ బయలుదేరి వెళతారు.

## ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు అధిరోహించాలి

### ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ





**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 10 నంది పత్రిక** నియోజకవర్గంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను ఎమ్మెల్యే నివాసానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే , వారితో కలిసి అల్పాహారంచేస్తూ ఆప్యాయంగా మాట్లాడారు చదువులో విజయం సాధించాలంటే కష్టపడి ఇష్టపడి చదవడంతోపాటు తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతల విద్యార్థులు కూడ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి మంచి ప్రతిభ కనబరచాలని ఆమె సూచించారు అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ఆళ్లగడ్డకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎమ్మెల్యే ప్రోత్సాహానికి ఆనందం వ్యక్తం చేస్తూ, తమపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు .





# యువకుడు ఆత్మహత్య

**కొత్తపల్లి – నంది పత్రిక:** చేసిన అప్పులు ఏలా తీర్చాలో తెలియని ఆయోమయ స్థితిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలమేరకు మండల పరిధిలోని దుద్యాల గ్రామంలోని రాజమూరి నాగశేషులు, నాగలక్ష్మిలకు కుమారుడు రాజమూరి పుల్లయ్య అలియాస్ ప్రవీణ్ (23) అనే యువకుడు, మరో ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పుల్లయ్య ఇంటర్ వరకు చదువుకొని చదువు మానివేసి సుమారు 5 సంవత్సరాల నుంచి ఆత్మకూరు పట్టణంలోని ఓ మెకానిక్ షాపునందు బైక్ మెకానిక్గా పనిచేస్తున్నాడు. ఇతనికి రూ.10 వేలు జీతవస్తుంది. అయితే ఈ పదివేలు కుటుంబ ఖర్చులకు సరిపోయేవి కావు. దీంతో పుల్లయ్య తనకు తెలిసన స్నేహితుల వద్ద ఎక్కువ మొత్తంలో అప్పులు చేశాడు. అయితే ఆ అప్పులు ఏలా తీర్చాలన్న భయం మొదలైంది. ఈ విషయం తల్లి, దండ్రులకు తరచూ చెప్పేవాడు. వారు కూడా నువ్వేమి భయపడొద్దు మెల్లి మెల్లిగా తీర్చుకుందామని దైర్యం చెప్పారు. అయిన పుల్లయ్య అప్పుల బెడదతో తీవ్ర మనస్తాపానికి గురిఅయ్యాడు. దీంతో శనివారం పనికి వెల్లి వచ్చిన తర్వాతా అందరూ నిద్రిస్తున్న తరుణంలో ఇంట్లోనే ఫ్యాన్కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడడాని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అయితే ఆదివారం తెల్లవారుజామున తండ్రి నాగశేషులు ఇంట్లోకి వెల్లి చూడగా అప్పటికే కుమారుడు పుల్యయ్య ఫ్యాన్ విగతజీవిగా వ్రేలాడుతూ కనపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించిన అనంతరం మృతదేహాన్ని కటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమై తండ్రి నాగశేషులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు. ఎస్ఐ జయశేఖర్ వెల్లడించారు

## గాలి వానకు నెలకొరిగిన చెట్లు రాకపోకలకు అంతరాయం



**బనగానపల్లె మే 10నందిపత్రిక** సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బనగానపల్లె మరియు బనగానపల్లె నియెజకవర్గం లొని మండలాల్లో తీవ్రమైన గాలులు వీచి జల్లులు పడ్డాయి. ఈ గాలి వేగానికి పాణ్యం బనగానపల్లె ప్రధాన రహదారి పై అలమూరు వద్ద చింత చెట్టు నెలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడింది దింతో ఇరువైపుల వాహనాలు నిలిసిపోయాయి. సంబంధిత అధికారులు చెట్టును తొలగించి రాకపోకలను యధావిధిగా కొనసాగే ప్రయత్నం చేశారు.


## ఆళ్లగడ్డ అవోపా ఆధ్వర్యంలో ఉచిత మెగా వేరికోస్ వీన్స్ వైద్య శిబిరము..,,




**ఆళ్లగడ్డ ప్రతినిధి,మే10, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని అవోపాసేవాసదన్ లో సుశ్రుత ఫౌండేషన్ మరియు ఏషియన్ వ్యాస్క్యులర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఉచిత మెగా వేరికోస్ వీన్స్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం నాడు జరిగిన ఈ శిబిరానికి వైద్యులు 80 మందికి పరీక్షలువీరికి5వేల – రూపాయల విలువగల కలర్ డోప్లర్ స్క్రీనింగ్ టెస్ట్ ను ఉచితంగా చేశారు.ఇందులో భాగంగా 35 మంది పేషెంట్స్ ను లేజర్ ట్రీట్మెంట్ కొరకు హైదరాబాద్ రెఫర్ చేయడము జరిగింది.వారిని ఆళ్లగడ్డ నుండి హైదరాబాదుకు తీసుకుపోయి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సాయి తేజ (హైదరాబాద్) సురేంద్ర ( పి ఆర్ ఓ ) అవోపా సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ సాయి తేజ వేరికోసిల్ లక్షణాలను గురించి వివరంగా తెలియజేశారు. పి.ఆర్. ఓ .సురేంద్ర ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్డు ఆయుష్మాన్ భవకార్డు అవసరమనీతెలియజేశారు.అవోపా అధ్యక్షులు టి.సత్యనారాయణ మెడికల్ క్యాంపు గురించి వివరిస్తూ ముందు ముందు ఇంకా మంచి కార్యక్రమాలు చేయగలమని తెలిపారు. అవోపా రాష్ట్ర కో–కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ఇటువంటి మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగము చేసుకోవాలన్నారు.

## మద్యం మత్తులో సొంత బైక్‌ను తగులబెట్టిన యువకుడు





**రుద్రవరం ప్రతినిధి మే 10 (నంది పత్రిక):** కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సిఐ రాము తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరు రోడ్డుకు వెళ్లే దారిలో దూదేకుల మౌలాలి (23) అనే యువకుడు మద్యం సేవించి, ఆ మత్తులో తన బైక్‌ను (ఏపీ 39 ఋ 2927) కాల్చివేశాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ జయప్ప సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 273 రీడింగ్ రావడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ పేర్కొన్నారు.




## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పండించడమే లక్ష్యం:

ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ నియోజకవర్గ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భూమా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి సిల్క్ క్యాంపు గోడపత్రికను ఆవిష్కరించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొనేలా విద్యార్థులకు అబాకస్ కంప్యూటర్ బేసిక్స్ స్పోకెన్ ఇంగ్లీష్ టైక్వాండో బ్యాడ్మింటన్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఆధునిక ప్రపంచానికి తగ్గట్టు నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో ఈ వేసవి సిల్క్ క్యాంపును పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేలా మార్గ నిర్దేశం చేయడమే భూమా ట్రస్టు లక్ష్యమని ఈ అవకాశాన్ని నియోజవర్గంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు.



# నమో నారా భేటీలో నవ్వుల సందడి

- ప్రధాని మోదీ చేసిన సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- ఇకపై బరువు తగ్గొద్దంటూ మంత్రి లోకేష్ కు ప్రధాని మోదీ సలహా
- మీరే స్ఫూర్తిగా పూర్తి ఫిట్నెస్ సాధిస్తానన్న మంత్రి లోకేష్
- పీఎం, ఏపీ సీఎం తేనీటి విందులో సరదా సంభాషణలు, ఆసక్తికర చర్చలు



**హైదరాబాద్ బ్యూరో చీఫ్ మే 10నంది పత్రిక** ఒకరు దేశానికి ప్రధాన మంత్రి.. మరొకరు సీనియర్ ముఖ్యమంత్రి.. ఇద్దరూ రాజకీయాల్లో మేరు నగధీరులు... గంభీరంగా ఉంటారు. నిత్యం అభివృద్ధి-సంక్షేమం, దేశం-రాష్ట్రం గురించే వీరి ఆలోచన, తపన. క్షణం తీరికలేని పర్యటనల్లో ఉంటారు. తొలిసారిగా వీరిద్దరూ మధ్య సరదా సంభాషణలతో సమావేశం జరిగింది. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు ఇంటికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ గంటకుపైగా సమయాన్ని చంద్రబాబు నివాసంలో గడిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆసాంతం నవ్వులు విరిశాయి. సీఎం చంద్రబాబు నివాసంలోకి అడుగు పెడుతుండగానే... ఓ ఫొటో చూసిన ప్రధాని ఏడాది క్రితం అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సరిగ్గా ఏడాది క్రితం యువగళం కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ ఢిల్లీలో చేయించారు మంత్రి నారా లోకేష్. అప్పటి ఫోటోను ఫ్రేమ్ చేయించి.. అందులో యువగళం కాఫీ టేబుల్ బుక్ కూడా భద్రపరిచారు. ఇది సీఎం చంద్రబాబు ఇంట్లోకి వెళ్లే ముందు కనిపిస్తుంది. ప్రధాని మోదీ ఆ ఫొటోను చూసి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ పుస్తకాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించి ఏడాది పూర్తైందని... యాధృచ్చికంగా ప్రధాని తమ ఇంటికి వచ్చారంటూ ప్రధాని మోదీకి నాటి సంఘనటలను లోకేష్ గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు ఇంటిలోని రామమందిరం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలు దశాబ్దాల క్రితం నాటివని... ఆ పంచలోహ విగ్రహాలను నందమూరి తారకరామారావు గారు తమకు ఇచ్చారని సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి వివరించారు.

**అన్నింటిలోనూ ప్రధానే ఆదర్శం...** చంద్రబాబు నివాసంలో ప్రధానితో సమావేశం సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న సాయానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక ఈ సమావేశంలో లోకేష్ ఫిట్నెస్ పై ఆసక్తికర సంభాషణ జరిగింది. లోకేష్ ఇలా స్లిమ్‌గా, ఫిట్‌గా మారడానికి ప్రధాని మోదీనే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు. తొలిసారి ప్రధానితో భేటీ అనంతరం లోకేష్ ఫిట్నెస్, డైట్ పై శ్రద్ధ పెట్టారని సీఎం చంద్రబాబు ప్రధానికి చెప్పారు. లోకేష్ ఇంకా బరువు తగ్గొద్దంటూ మోదీ సలహా ఇచ్చారు. ఫిట్నెస్ విషయంలో మీరే స్ఫూర్తి అని... మరింత ఫిట్ గా మారతానని లోకేష్ ప్రధానితో చెప్పారు. దేశం కోసం క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నారని, 75 ఏళ్ల వయస్సులో ప్రధాని పాటించే ఆరోగ్య సూత్రాలు, శారీరక ధృడత్వం వంటివి తనకు స్ఫూర్తి అని మంత్రి లోకేష్ ప్రధానితో చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ పని విధానం చూస్తుంటే... 25 ఏళ్ల వయస్సున్న ముగ్గురు యువకులు ప్రధానిలో ఉన్నట్టు చురుగ్గా పని చేస్తారని ఈ సందర్భంగా లోకేష్ అన్నారు.

**నాకు ఇద్దరు మెంటార్లు..** ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరూ తనకు మెంటార్లే ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాజకీయాల్లోనూ, అభివృద్ధిలోనూ, ప్రజా సంక్షేమంలోనూ దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు తనకు మార్గదర్శకులని... ఇద్దరూ తనకు మెంటార్లేనని, గురువులుగా వారిని అనుసరిస్తానని లోకేష్ అన్నారు. అంకితభావంతో, సేవా ధృక్పధంతో భావితరాల కోసం నిస్వార్థంగా పని చేసే మోదీ, చంద్రబాబుల స్పీడ్ అందుకోవాలనే తన కల సాకారం కావాలని కోరుకుంటున్నాను అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఎప్పుడు కలిసినా తన నియోజకవర్గం మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించడం నారా లోకేష్ ఆనవాయితీగా పెట్టుకున్నారు. మంగళగిరి చేనేత శాలువాతో ప్రధానిని సత్కరించి లోకేష్.. మంగళగిరి చేనేత విశిష్టతను ప్రధానికి వివరించారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో టోపీలు పంపిణీ





**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 10 నంది పత్రిక** ,వేసవి కాలం దృష్ట్యా రోటరీ క్లబ్ లో, ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆళ్లగడ్డ మండలం బత్తులూరు లో పట్టణంలోనిపొట్టి శ్రీరాములు సర్కిల్ దగ్గర దాదాపు8 వేల రూపాయల విలువగల టోపీలు పంపిణీ చేశారు, రోటరీ క్లబ్ అధ్యక్షులు పోలేపల్లె. సత్యనారాయణ టోపీలను, స్పాన్సర్స్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలేపల్లె. సత్యనారాయణ , ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్, క్లబ్బు మాజీ అధ్యక్షులుదేవిశెట్టి హరీష్ బాబు, శబరీష్ సత్యం విశ్రాంతి ప్రిన్సిపాల్,శంకర్ రెడ్డి , బ్యాంకు బాలిరెడ్డి , విద్యాసంస్థల అధినేత పాపిరెడ్డి, న్యాయవాది సుబ్బారెడ్డి, మా టీవీ ప్రసాద్, చంద్రసేన పాల్గొన్నారు అంతకుముందు పట్టణంలోని రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో అధ్యక్షులు పోలే పల్లె సత్యనారాయణ ఆధ్వర్యంలో క్లబ్బు సమావేశం జరిగింది ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షులు సత్యనారాయణ, బైసాని రవి ప్రకాష్ మాట్లాడుతూ గతంలో చేసిన కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చేసే కార్యక్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. మాజీ క్లబ్ అధ్యక్షులు తమ సలహాలు సూచనలు వివరించారు.



# స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా 'ఊరి కోసం - ఒక్క రోజు'





- పారిశుధ్య పరిరక్షణకు సర్పంచ్ పబ్బు సతీష్ వినూత్న పిలుపు
- శ్రమదానంలో పాల్గొన్న పాలక వర్గం

:"మనం పుట్టిన ఊరు.. మనల్ని పెంచిన నేల బాగు మన బాధ్యత" అనే నినాదంతో హన్మకొండ జిల్లా కమలాపూర్ గ్రామంలో 'ఊరి కోసం - ఒక్క రోజు' శ్రమదానం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గ్రామ పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, కమలాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్పంచ్ పబ్బు సతీష్ ఈ పిలుపునిచ్చారు.

**క్షేత్రస్థాయిలో శ్రమదానం**ఆదివారం ఉదయం సర్పంచ్ సతీష్ స్వయంగా పార పట్టి డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు ఉత్సాహంగా శ్రమదానంలో పాల్గొని మురుగు కాలువలను, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూసిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు, గ్రామం పెద్దది కావడంతో పారిశుధ్య సిబ్బంది సంఖ్య తక్కువగా ఉందని, అందుకే ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.నెలలో రెండు రోజులు గ్రామాభివృద్ధికి పిలుపు సర్పంచ్ వార్డు సభ్యులు కలిసి నెలలో రెండు రోజులు అన్ని వార్డుల్లో స్వయంగా శ్రమదానం నిర్వహిస్తారని తెలిపారు. గ్రామానికి చెందిన ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడా నెలలో ఒక్కరోజు గ్రామానికి వచ్చి పారిశుధ్య పనుల్లో పాల్గొని గ్రామస్తులను చైతన్యపరచాలని కోరారు. మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు మొక్కల సంరక్షణే ప్రధాన అజెండాగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. "కన్నతల్లి లాంటి మన ఊరి బాగు కోసం, మనందరి ఆరోగ్యం కోసం యువతీ యువకులు, గ్రామ పెద్దలు తమ విలువైన సమయంలో కేవలం ఒక్క రోజును కేటాయించాలి. అందరం కలిసి మన గ్రామాన్ని స్వచ్ఛ కమలాపూర్‌గా మార్చుకుందాం." అని సర్పంచ్ పబ్బు సతీష్ తెలిపారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో గ్రామ పాలక వర్గం సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఊరి బాగు కోసం సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

## కల్వల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఎం బృందం.



**కేసముద్రం, మే 10(నంది పత్రిక)**:అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం కేసముద్రం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న అన్నారు. ఆదివారం కేసముద్రం మండలం కల్వల గ్రామంలో పిఎసిఎస్ కేసముద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం మండల కమిటీ బృందం సందర్శించారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ పది రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించారు. తేమ శాతం అధికంగా ఉండడంతో 8వ తారీకు నుండి బస్తాలు నింపి కాంటాలు ప్రారంభించారు. శనివారం సాయంత్రం వచ్చిన అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారని, నింపిన బస్తాలు కాంటాలు పెట్టి మిల్లులకు తరలించాలని, తేమపేరుతో ఎలాంటి తరుగు తీయవద్దని, కాంటాలు పెట్టిన వారం లోపు రైతులకు డబ్బులు చెల్లించాలని, మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ త్వరితగతిన చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, మండల కమిటీ సభ్యులు మోడెం వెంకటేశ్వర్లు, జల్లే జయరాజ్, నీరుటి జలందర్, సుంకరి వెంకన్న, రైతులు పెద్దారపు అశోక్, ధరావత్ రవి, ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎం.వెంకట్ రెడ్డి, సపవత్ సజ్జన్, ధరావత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రధాని మోడీ సభకు వేములవాడ నుండి కదిలిన కాషాయ దళం

### పరేడ్ గ్రౌండ్స్ సభకు బిజెపి శ్రేణుల భారీ తరలింపు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో బయలుదేరిన నాయకుల



ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు వేములవాడ పట్టణ భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తెలంగాణ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రధాని వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తున్న నేపథ్యంలో, ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి సాక్షిగా నిలిచేందుకు వేములవాడ నుంచి భారీగా శ్రేణులు బయలుదేరారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే వేల కోట్ల నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని సభకు కార్యకర్తలు స్వచ్ఛందంగా, ఉత్సాహంగా తరలిరావడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, పార్టీ నాయకులు పిన్నింటి హనుమన్లు, వాస మల్లేశం, బిల్ల కృష్ణారి, రేగుల శ్రీకాంత్, మామింద లక్ష్మీరాజ్యం, మహంకాళి శ్రీనివాస్, మనోజ్, యశ్వంత్, మెరుగు లక్ష్మణ్, బాల శేఖర్, మల్లెపు లక్ష్మణ్ తో పాటు పట్టణ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మీయతకు నిలువెత్తు నిదర్శనం.. దుద్దెకుంట పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### సేవా భావంతో ముందుకొచ్చిన 2008-2009 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు

అనంతపురం జిల్లా పరిధిలోని దుద్దెకుంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 18 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. మొదట ఉపాధ్యాయులను సత్కరించి తమ విద్యాభ్యాస దశలో పొందిన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారంగా దాదాపు రూ.10 వేల విలువ చేసే ఫర్నిచర్‌ను పాఠశాలకు అందజేశారు.విద్యార్థులకు ఉపయోగపడేలా చేసిన ఈ సహాయం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు పూర్వ విద్యార్థులను అభినందించారు. అలాగే తమతో కలిసి చదువుకున్న ఓ మిత్రుడు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మానవత్వంతో స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. "స్నేహం అంటే కష్టసుఖాల్లో తోడుగా నిలవడం" అనే మాటను ఆచరణలో చూపించారు.ఇక గతంలో పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా సేవలందించిన రాఘవ ప్రసాద్ పూర్వ విద్యార్థి కరిబసప్ప అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, అతనికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. తమ గురువులపై, స్నేహితులపై ఉన్న అభిమానాన్ని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల మన జీవితాలకు పునాది వేసింది. ఇక్కడి గురువులు అందించిన విద్య, విలువల వల్లే జీవితంలో స్థిరపడ్డాం. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును కొనసాగిస్తాం అని తెలిపారు.ఈ ఆత్మీయ సమ్మేళనం గ్రామంలో ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం





**నిబంధనలు మారాయా? లేఅవుట్ మారిందా? అధికారులు గాడి తప్పారా? దిన దినం కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలం గతంలో కూల్చివేతలు, ఇప్పుడు సహాకారం అనధికార లేఅవుట్ కావటంతో కబ్జాలు అందిన కాడికి దండుకుంటున్న అధికారులు**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కొంపల్లి డివిజన్ లోని సర్వే నంబర్ 144, నందక హాస్పటల్ పక్కన గత ఏడాది పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని అప్పటి మున్సిపల్ కమిషనర్ కూల్చివేతలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని రక్షించారు. అదే స్థలంలో ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులు నిర్మాణం చేపట్టడంతో తీవ్రత సంతరించుకుంది. ఫిర్యాదుల నేపథ్యంలో కమిషనర్ తోపాటు టౌన్ ప్లానింగ్ అధికారులు స్వయంగా స్థలాన్ని పరిశీలించి, పార్కు కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలమని నిర్ధారించి అక్రమ ఫెన్సీ ను తొలగించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మళ్లీ అనుమతులు రావడం ఏంటని ఇక్కడ తలెత్తుతున్న కీలక ప్రశ్న. కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు తనిఖీ చేసి పార్క్ స్థలమని తేల్చిన తర్వాత అట్టి స్థలం ప్రయివేటు వ్యక్తులకు ఎలా చెడుతుంది అని స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు ప్రైవేటు వ్యక్తులకు అనుమతులు ఎలా జారీ చేశారు అని జనం ముక్కున వేలేసుకుంటున్నారు. నిబంధనలు మారాయా? లేఅవుట్ మారిందా? అధికారులు గాడి తప్పారా? అని స్థానికులు నివ్వెర పోతున్నారు. ఈ వ్యవహారం మొత్తం చూసి అధికారుల ధన దాహానికి ప్రజల ఆస్తి ప్రయివేటు వ్యక్తులపరం అవుతుందని, ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన టౌన్ ప్లానింగ్ అధికారులు, లంచాల ముందు చట్టాన్ని తాకట్టు పెడుతున్నారా, లేక నిబంధనలు సామాన్యులకు మాత్రమే వర్తిస్తాయా అని, అధికారులకు ముడుపులు చెల్లిస్తే పార్కు స్థలం కూడా ప్రైవేట్ స్థలంగా మారుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ అనుమతుల వెనుక ఎంత డబ్బు మారింది? ఎవరి జేబులు నిండాయి? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులదే అంటున్నారు. స్థానిక ప్రజానీకం, గతంలో కూల్చిన అంశాన్ని పక్కనపెట్టి ఇప్పుడు అనుమతులు ఎలా ఇచ్చారు అని, ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేని యెడల క్రమేణ ప్రభుత్వ భూములు లేకుండా పోయే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ అమలు జీవో కాపీలను దహనం చేసిన కుత్బుల్లాపూర్ మండల సిఐటియు కమిటీ



– సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ శుభం హోటల్ భవన నిర్మాణ కార్మికుల సంఘం అడ్డా దగ్గర నాలుగు లేబర్ కోడ్స్ అమలు జీవో కాపీలను దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధాన్ని మొదలుపెట్టిందని ఈ లేబర్ కోడ్స్ కార్మికుల మెడలకు బిగించిన ఉరితాళ్లేనని. ఎన్నికల సమయంలో మాయ మాటలతో ప్రజలను వంచించిన పాలకులు, గద్దెనెక్కిన వెంటనే కార్పొరేట్ శక్తుల పాదాల కాడ కార్మిక హక్కులను తాకట్టు పెట్టిన కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రక్తం చిందించి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కనీస వేతనం సామాజిక భద్రత వంటి హక్కులను ఈ ప్రభుత్వం తుంగలో తగ్గిందని కార్మిక వర్గంపై సాగుతున్న ఈ పాశవిక దాడిని సహించేది లేదనీ చరిత్రలో ఏ రోజూ పాలకులు.కార్మిక హక్కులను ఉచితంగా ఇవ్వలేదనీ. లాటీలు తూటాలను ఎదిరించి పోరాటాల ద్వారానే మనం. హక్కులను సాధించుకున్నాం. పెద్ద పెద్ద పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తుల అండతో ఏర్పడిన ఈ ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని.ఇలాంటి ప్రభుత్వాన్ని సాఘనం పే వరకు కార్మిక వర్గం ఐక్యతతో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాషా. శ్రీశైలం. యాదవ రెడ్డి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ కేబినెట్‌లో 29 ఏళ్ల యువ నటికి చోటు



తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాల ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి తెరదించుతూ నటుడు విజయ్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన, తన తొలి మంత్రివర్గాన్ని కూడా ప్రకటించారు. విభిన్న రంగాలకు చెందిన నిపుణులు, యువతకు ప్రాధాన్యమిస్తూ ఏర్పాటు చేసిన ఈ కేబినెట్‌లో పలు ఆసక్తికర ముఖాలు ఉన్నాయి.విజయ్ మంత్రివర్గంలో 29 ఏళ్ల నటి ఎస్. కీర్తనకు చోటు దక్కడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శివకాశి నుంచి గెలిచిన ఆమె, కేబినెట్‌లో అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందారు. పార్టీ ఆవిర్భావానికి ముందు విజయ్ ఫ్యాన్ క్లబ్ అధ్యక్షుడిగా ఉండి, ఇప్పుడు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎన్. ఆనంద్‌కు మంత్రివర్గంలో కీలక స్థానం లభించింది. అలాగే గతంలో డీఎంకే గెలుపులో వ్యూహకర్తగా పనిచేసిన బాస్కెట్‌బాల్ మాజీ క్రీడాకారుడు ఆధవ్ అర్జున, మాజీ ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్, దంత వైద్యులు డాక్టర్ టీకే ప్రభు కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఐదు దశాబ్దాల పాటు అన్నాడీఎంకేలో పనిచేసి, గతేడాది ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి విజయ్‌తో చేరిన సీనియర్ నేత సెంగొట్టైయన్‌కు కేబినెట్‌లో బెర్త్ దక్కింది. విజయ్‌కు సుదీర్ఘకాలంగా మేనేజర్‌గా ఉన్న అడ్వకేట్ పి. వెంకటరమణన్, పార్టీ ఐటీ విభాగం డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ సైతం మంత్రులయ్యారు. విజయ్ ప్రకటించిన తొలి జాబితాలోని వారంతా 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి చెందినవారే కావడం గమనార్హం.

# లిక్కర్ మిక్సింగ్ ముఠా గుట్టు రట్టు

**ప్రీమియం లిక్కర్ లక్ష్యంగా వ్యాపారం ఒరిస్సా ప్రాంతానికి చెందిన ముఠా లో ముగ్గురిలో ఇద్దరి అరెస్ట్.**



:- మామూలు లిక్కర్ తాగితే ఏముంటుంది అన్నా.. ప్రీమియం బ్రాండెడ్ లిక్కర్ తాగితే మంచి కిక్ వస్తుందన్నా.. ప్రీమియర్ లిక్కర్ కూడా మనకు మామూలు లిక్కర్ ధరలోనే మనకు లభిస్తుందన్న అంటూ నమ్మ బలికి ప్రీమియం లిక్కర్ లో సాధారణ లిక్కర్ కలిపి ఫంక్షన్లలోనూ తెలిసినా.. బడా బాబులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్న ఒక ముఠాను ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ మాదాపూర్ టీం సిఐ సావిత్రి సౌజన్య సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లిక్కర్ మిక్సింగ్ జరుగుతుందనే పక్కా సమాచారం మేరకు మాదాపూర్ ఎక్సైజ్ డిటిఎఫ్ సీఐ సావిత్రి సౌజన్య, టీం సిబ్బంది కలిసి రసూల్ పుర మెట్రో స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 6 ఆరు శివాజీ రీగల్ ప్రీమియం లిక్కర్ బాటిల్ లభించాయి. వాటిని పరిశీలించగా ప్రీమియం లిక్కర్ బాటిల్ లో తక్కువ ధర కలిగిన మద్యం మిక్సింగ్ చేసినటువంటి గా చేసినట్లుగా ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. ఈ విషయంపై నిందితులను ప్రశ్నించినప్పుడు అసలు విషయం వెల్లడించారు. దీంతో మిక్సింగ్ లిక్కర్ తయారీ ప్రాంతానికి నిందితులతోవెళ్లారు. లిక్కర్ మిక్సింగ్ ప్రాంతంలో 41 ఫుల్ బాటిల్స్ మిక్సింగ్ చేసినటువంటి శివాజీ రీగల్ మద్యం బాటిల్ ఉన్నాయి. మిక్సింగ్ మద్యం నింపడానికి వివిధ రకాలైన హై క్వాలిటీ ప్రీమియం లిక్కర్ బాటిల్స్ 63 లభించాయి. చివరకు రూ.25 వేల విలువ కలిగిన రాయల్ సెల్యూట్ లాంటి మద్యం బాటిల్ ని కూడా ఈ ముఠా మిక్సింగ్ మద్యంతో నింపి అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నాట్టు ఎక్సైజ్ విచారణలో వెల్లడయింది. మిక్సింగ్ లిక్కర్ దందా ముఠాలో చికున్ స్వాయిన్, సోను మహంతి, ప్రఫుల్ కుమార్ నాయక్ ఉన్నట్లు మాదాపూర్ డిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. ఈ మిక్సింగ్ లిక్కర్ ముఠాను పట్టుకున్న టీంలో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సావిత్రి సౌజన్య, ఎస్ఐ శివరామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ జనార్ధన్ రిశ్వాన్, సిద్ధిఖీ, అనుషాలు ఉన్నారు. ఈ కేసులో చికున్ స్వాన్, సోను మహంతులను అరెస్ట్ చేశారు. ప్రఫుల్ కుమార్ నాయక్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి. ఏఈఎస్ శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను మిక్సింగ్ లిక్కర్ను కాళీ బాటిల్లను మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

## రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి...

ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## పెట్ బషీరాబాద్ పీఎస్ ఎదుట బి ఆర్ఎస్ మహిళల ధర్నా




:- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయి, నిష్పక్షపాత విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలి అని, బాధితురాలికి రక్షణ కల్పించి అని, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి అని, బేటి బచావో బేటి పడవో నినాదాలను నిత్యం పలుకుతున్న బిజెపి ప్రభుత్వం మహిళల భద్రతపై మాటలు మాత్రమే కాకుండా, చర్యల్లో కూడా తమ నిబద్ధత చూపాలనీ ఆదివారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ముందు మహిళా సంఘాలు ధర్నాకు దిగాయి. రాజకీయ ప్రభావంతో కేసులను నీరుగార్చే ప్రయత్నాలు ఆపాలిలని బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తమ న్యాయ పోరాటం ఆపమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు పావని గౌడ్, మెట్టుగూడ మాజీ కార్పొరేటర్ రాసురి సునీత, శైలజ, సరిత, గుంటీ మంజుల రాణి, గాదె స్రవంతి, అరుణా రెడ్డి, వివిధ మహిళా సంఘాల నాయకురాలు, స్థానిక మహిళలు, మద్దతు దారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో మరింత మెరుగైన స్మార్ట్ సొల్యూషన్స్ సేవలు



– పోలీస్ శాఖలో ఆధునిక ఐటీ టెక్నాలజీ, డిజిటల్ సేవలు, స్మార్ట్ సొల్యూషన్స్ ద్వారా సేవల సామర్థ్యాన్ని మరింత మెరుగు పర్చేందుకు తమవంతు పూర్తి సహాయ సహాకారాలు అందించనున్నట్లు బిఎస్ఐటీ సాఫ్ట్వేర్ సర్వీసెస్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓలు భానుచందర్ గారిగెల్లా, శారధ నేనావత్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సివి అనంద్ ను వారు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీజీపీ తో స్మార్ట్ సొల్యూషన్స్ ద్వారా పోలీస్ శాఖలో సేవల సామర్థ్యాన్ని మరింత మెరుగుపర్చే అంశాలపై చర్చించినట్లు వారు తెలిపారు. 11 సంవత్సరాలకు పైగా ఐటీ రంగంలో అనుభవం కలిగిన బీఎస్ఐటీ సాఫ్ట్వేర్ సర్వీసెస్ వెబ్ సైట్స్ డెవలప్మెంట్, మొబైల్ అప్లికేషన్స్, ఈఆర్పీ, క్లౌడ్ ఆధారిత సాఫ్ట్వేర్ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. బీఎస్ఐటీ సాఫ్ట్వేర్ సర్వీసెస్ సంస్థ ఐటీ రంగంలో సాధిస్తున్న అభివృద్ధిని డీజీపీ అభినందించారు. ఐటీ సంస్థ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## అంగరంగ వైభవంగా వనం వారి ఆత్మీయ సమ్మేళనం




:- హయత్ నగర్ లోని ధనంజయ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఆదివారం వనం కుటుంబీకుల వనం వారి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం అంగరంగ వైభవంగా కన్నుల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వనం కుటుంబీకులు కుల బంధవులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకొని పరిచయాలు చేసుకొని వారి అభిమానాన్ని ఆత్మీయతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేనేతకు సంబంధించి మహిళలు పురుషులు, హ్యాండ్లూమ్ వాక్ లో పాల్గొనడం జరిగింది. ముఖ్యంగా మాతృ దినోత్సవ సందర్భంగా మాతృమూర్తులు అందరికీ సత్కరించుకోవడం జరిగింది. రాబోవు ఫాదర్స్ డే ను పురస్కరించుకొని తండ్రులందరినీ సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్కీ డిప్ విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను అందజేశారు. వనం వారందరూ జాతీయ గీతాలు భక్తిశ్రద్ధలతో ఆలపించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వనం జయశ్రీ, వనం శ్రీ సరిత, వ్యాఖ్యతలుగా వివహరించారు. వనం సుమన్, వనం విశ్వనాథం, వనం దుశ్యాంతల, వనం జయరాజ్, వనం పద్మనాభం, వనం మహేష్, వనం వంశీకృష్ణ, వనం యాదగిరి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సీఎంగా విజయ్ ప్రమాణం.. నీలిరంగు పట్టుచీరలో ప్రత్యేక ఆకర్షణగా త్రిష..

తమిళనాడు ముఖ్యమంత్రిగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత సి. జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేస్తున్న వేళ, ప్రముఖ నటి త్రిష కృష్ణన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నీలిరంగు కంచి పట్టుచీర, జడలో మల్లెపూలు, వజ్రాలు, కెంపుల నెక్లెస్‌తో సాంప్రదాయబద్ధంగా ముస్తాబై అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ చారిత్రక ఘట్టాన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని కార్యక్రమానికి ముందు త్రిష పేర్కొన్నారు. ఆమె వెంట తల్లి ఉమా కృష్ణన్ కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న ద్రవిడ దిగ్గజాలైన డీఎంకే, అన్నాడీఎంకేలను ఓడించి విజయ్ చరిత్రాత్మక విజయం సాధించారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి త్రిష తన మిత్రుడు విజయ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఫలితాల రోజు (మే 4న) తన పుట్టినరోజున తిరుపతిలో ప్రత్యేక పూజలు చేశారు. విజయ్ పార్టీ ఆధిక్యం ఖరారయ్యాక చెన్నైలోని ఆయన నివాసానికి కూడా వెళ్లారు. అంతకుముందు, పోలింగ్ రోజున 'గిల్లి' సినిమా నేపథ్య సంగీతంతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి పరోక్షంగా తన మద్దతు తెలిపారు.

# ప్రాకృతిక కవితా నేత్రుడు

కొలనులు, నదులు, కొండలు, నింగి, నేల, పువ్వులు, జలపాతాలు, వెన్నెల, ఋతువులు, ఉదయ సాయంసంధ్యలు ఇటువంటి అన్నింటి అందచందాలు, సౌకుమార్యాల తీయందనాలు ఆబగా గుండెలలో నిండించుకుని సహజ కవిత్వాలు పండించిన కవి కవికొండల వేంకటరావు. ప్రాకృతిక వస్తువులు కవుల్ని ఆకర్షించడం, వారు కవిత్వాలు వెలయించడం అనూచానంగా వస్తున్నదే. కానీ ఎన్ని రాసినా ఏమి రాసినా వస్తుతాదాత్మ్యంతో పరవశించి, నాగరిక జానపదునిగా రసవత్ సృజన చేసిన మహానుభావుడు కవికొండల. గురజాడ 'ప్రకృతి పుస్తకాన్ని పఠించండి' అని ప్రవచించేవారు. గురజాడ ప్రభావితులు, వారసులు ఎందరున్నా వారిలో నండూరి సుబ్బారావు, గరిమెళ్ళ సత్యనారాయణ, బసవరాజు అప్పారావు, కవికొండల వేంకటరావు వారి వారి ప్రత్యేకతలతో ముఖ్యులయ్యారు. ఇంటి పేరులోనే కవి శబ్దం ఉన్న వేంకటరావు ఆంధ్రా వర్డ్స్‌వర్త్‌గా అన్వర్థనాములయ్యారు. జానపద కవితా రహస్య తత్త్వవేత్త అవడమే కాదు, తన పాటలతో, గేయాలతో జనాన్ని ఉవ్విళ్ళూరించారు. కవికొండల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తాలూకా శ్రీరంగపట్నంలో 1892 జూలై 20వ తేదీన శేషమాంబ నరసింహం దంపతులకు జన్మించారు. రాజమండ్రిలో ఉన్నత విద్యాభ్యాసం జరిగింది. నరసాపురంలో టైలరు పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగం. 1915లో చెన్నపురిలో బి.ఎస్. పట్టా చేపట్టాక రాజమండ్రిలో ఎక్కువ కాలం న్యాయవాదిగా జీవితాన్ని కొనసాగించారు. వీరేశలింగం పరోక్ష స్ఫూర్తితో గోదావరీ మండల సంఘసంస్కరణ సమితి అధ్యక్షులుగా సేవ చేయడమే కాదు; న్యాయవాదిగా సంఘసంస్కరణాప్రియులకు ఉచితంగా కేసులు వాదించిన ఆదర్శవ్యక్తి కవికొండల. రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాలు ఒ.జె. కూల్డ్రే దొర ఒక సాంస్కృతిక కేంద్రంగా భాసించేవారు. ఆయన 'సౌత్ ఇండియన్ అవర్స్' అనే తన గ్రంథాన్ని శిష్యులు కవికొండలతోపాటు దామెర్ల వెంకటరావు, అడివి బాపిరాజులకు అంకితమిచ్చారు. 1940లో కవికొండల 'వెన్నెల' మాసపత్రికను నడిపారు. తాను పెంచిన తీగ పెల్లగించబడితే చూసి కలవరపడి విలవిల్లాడే సుకుమారతత్త్వం ఆయనది. రాజమండ్రి, నరసాపురం, గుంటూరులతో ఆయన జీవితం ముడిపడింది. 1952లో ఆయన షష్టి పూర్తి ఉత్సవం వైభవోపేతంగా వారి స్థిర నివాసం రాజమండ్రిలో జరగడమే కాదు; కొన్ని ఇతర ప్రాంతాల్లోనూ జరగడం ఆయన రసజ్ఞ ప్రజాభిమానానికి చిహ్నం. కవికొండల మాతృదేశభక్తి, రాష్ట్రభక్తి, గాంధీ భావజాలానురక్తితో ఎన్నో రచనలు చేశారు. ఉన్న ఊరును మరచిపోకపోవడమే కాదు; శ్రీరంగపట్నంలో తానుండే వీధిని ఒక పుస్తకానికి ముఖపత్రంగా వేసుకున్న సత్తెకాలపు మనిషి ఆయన. ఒక కొండ ఎదుట కొలను అందులో వికసించే ఉత్పల పుష్పాలు ఈ ముఖచిత్రాన్ని తన పుస్తక ధారావాహికల్లో వేసుకున్నవారు. ఆయనను 'కొండకొలను వికసితోత్పల కవి' గానూ సంబోధించేవారు. తీక్ష్ణంగా కవిత్వం రాసే ఆయన చమత్కారి కూడా. "ఏ వూరు వెడతావు ఉడుత!/ మా వూరెడతాను బుడుత/ మీ వూరెక్కడే ఉడుతా/ మింటి కొబ్బరిచెట్టు బుడుత!" వంటివి ఇందుకు ఉదాహరణలు. "రవికాననిచో కవిగాంచును" అనే వాక్యాన్ని "రవిక ఆననిచో కవి కాంచును" అని తొలుత విరిచి చెప్పింది కవికొండలే! ఆంగ్ల కవిత్వంతో రచన ఆరంభించి తెలుగు కవిత్వంలో శాశ్వతకీర్తిని ఆర్జించారు. మూడు వందల చిన్న కథలు రాయడం వలన 'కథక చక్రవర్తి' అని మెచ్చులందారు. వ్యక్తులకు కాక ప్రాంతాలకే తన కృతులు అంకితమిచ్చిన వైచిత్ర్య గుణమాయనది. 'త్రయి' పుస్తకాన్ని చెన్నపట్టణానికి, 'తిరువళిక్కి'ని రాయపురం ప్రశాంత సముద్రానికి అంకితమిచ్చారు. 'విజనసదనం', 'ఇనపకోట' వంటి నవలలు రాశారు. ఆయన జ్ఞాన విస్తృతికి 'తెనుగుదనం' వ్యాస సంపుటి దర్పణం. ఆయన స్వతంత్రించి కొత్త దారులు తొక్కడం వల్ల అద్భుత ప్రయోగాలు విలక్షణ శైలులు కేళాకుళుల్లా (ఫౌంటెన్స్) నింగిని ముద్దుపెట్టుకున్నాయి. అవ్యక్త వ్యక్తీకరణలయ్యాయి. ఆయన నటరాజనృత్య దృష్టితో 'శివరాత్రి ప్రభ' అనే కవిత రాయగా అది శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పైనే ప్రభావం చూపింది. అత్యాధునిక కవిత్వ ఖండికా అన్నంతగా దేశం చూపును తన పైకి తిప్పుకుంది. "జగన్నాథుని రథచక్రాలు శ్రీశ్రీ సొంతాస్తే అనుకున్నా కవికొండల శివరాత్రిప్రభకు అది ఎంత ఋణపడి వుందో శ్రీశ్రీయే చెప్పాలి; చెప్పాడు కూడా" అన్నారు కె.వి. రమణారెడ్డి. "శివరాత్రిప్రభ భావనలోను, గమనంలోను కవికొండల ఆవరించిన వైశాల్యం ఇంతట్లో ఎవరూ అందుకోలేరు" అని మహాకవి శ్రీశ్రీ అనడంలో ఎన్నో అంశాలు నిక్షిప్తమై గుప్తమై ఉండడాన్ని మనం భావించుకోవాలి. ప్రణయ కవితలు అద్భుతంగా రాశారు కవికొండల. "కళ్ళల్లో ముద్దెట్టుతూ/ తెల్లారనీనంటది/ తెల్లారిపోతూంటే/ తానెల్లాగొ అయిపోతది/ ఒక్కళ్ళమైయున్ననూ/ నక్కితానలుసొతది" అనే కవికొండల రసాత్మక వాక్యాలు ఎంకి పాటల స్థాయిలో ఉన్నాయనిపిస్తాయి. "నది నిండ నీరు ఉన్నదీ/ నావపై పిల్లున్నది/ పిల్లాకు వొళ్ళున్నదీ/ వొళ్ళెల్ల వయసున్నది" అనడంలో ఆయన భావుకత సువ్యక్తమవుతోంది. కాలంతో మమేకమైన ఈ కవి "మండు ఎండాకాలమొక పాట రాలేదు/ వానకాలమ! నీవు పాడింతువానన్ను!/" అని ప్రశ్నిస్తారు. వానని కురిపించమనే ఆయన నిస్వార్థ అభ్యర్థన "చెట్లకొరకే/ పూలకొరకే/ చిగురుజొంపం చెలగుకొరకే/ చిలుకుదేవా! చిన్నవర్షం!" వాక్యాల్లో ప్రతిఫలిస్తుంది. రంగుల సొబగులు చిత్రించడంలో "ఎర్రని సంజలో నల్లని పిల్ల పచ్చగడ్డి కోస్తోందట" అంటారు. "నిశ్శబ్ద వీధిలో నిర్యాణ గీతా"ల్నీ పలికించారు. "భానూ దయంపై ప్రియురాలు ఎర్రగానం" చేసిందనే ఆయన అభివ్యక్తీకరణం ఎంత ఆధునికం! సంకోచరహితంగా స్వతంత్ర ఆలోచనా విధానంతో ఆయన వందల గేయాలు ఎన్నో కైత పొత్తాలుగా రసజ్ఞ చిత్తాలను లోగొన్నాయి. వస్తు స్వీకరణలో వైవిధ్యాలతోపాటు భావ సౌందర్యాలూ సమున్నతంగా ఉంటాయి. గోదావరి శాఖ వైనతేయంని ప్రేయసిగా, కడలిని ప్రియునిగా అభివర్ణిస్తూ కవికొండల రాసిన 'విలాసినీ వైనతేయం' కావ్యం ఆయన ఊహాశాలీనతకు శిఖరాయమాన దర్పణం!గుంటూరులో తన చిన్నకూతురి ఇంట్లో 1969 జూలై 4వ తేదీన కవికొండల కన్ను మూశారు.

కానీ ఆయన కవిత్వ నేత్రాలు చూసి హృదయంతో రాసిన అఖండ ప్రాకృతిక కవితలు మనకు ఎదవిందులు చేస్తూనే ఉంటాయి. కవికొండల వెంకటరావు అనగానే 'శివరాత్రి ప్రభ' తోపాటుగా ఠకీమని గుర్తొచ్చేది గడ్డిపూల గురించి రాసిన 'దాక్కొని ఉంటాయి' అనే కవిత.పాఠకుడు, విమర్శకుడు, శ్రోతలు గణించదగ్గవారే. కానీ రచనవేళల్లో వారిని దృష్టిలో పెట్టుకుని రాస్తే కొండొకచో కృతకత్వం వస్తే రావచ్చు. అలాకాక వస్తువు, కవి అభిముఖమై తాదాత్మ్యం చెందినప్పుడే విలక్షణ ప్రతిభాప్రకాశ ఆవరణలు జనిస్తాయి. కవికొండల విషయంలో ఈ అంశం ఫలించడం వలన అభివ్యక్తి నూతనత్వమో శైలీనూతనత్వమో విలక్షణంగా వచ్చాయి. సామాన్యంగా మనం నిర్లక్ష్యం చేసే గడ్డిపూలపై కవిత అలా వచ్చింది: "దాక్కొని వుంటాయి దారంట/ గడ్డినిరుక్కుని వుంటాయి/ తలపులరాని పూలు/ పిలువగబోని పూలు/ గ్రుక్కెడు వాననీళ్ళకు ఫక్కున నవ్వుతాయి/... లెక్కకు రావో లక్ష/ చిక్కవు మాలను గ్రుచ్చ/ ఒక్కడ నడుస్తువుంటే/ చుక్కలు పొడుస్తువుంటే/ మక్కువ కూర్చోమంటాయి..." ఇలా సాగుతుంది ఈ గేయం. కవికొండలకు ఒక శైలి ఉంది; ఆయనదంటూ ఓ కాలమూ ఉంది. అందుకే దేవులపల్లి కృష్ణశాస్త్రి గారే

"ప్రజలకు ఇంత సన్నిహితుడైన తెలుగు కవి ఈ యుగంలో లేడు" అని సత్య ధ్రువపత్రాన్ని ప్రకటించారు. చిన్నారి పువ్వులను తొక్కడం కంటే గుడ్డివాడవడమే మేలు అన్న సుకుమార హృదయం కవికొండలది. "కొండల్లో నా గుండియ వుంది/ చెట్లలో నా గొంతు వుంది" అనే ఆయన కవితాభిభాషణం ఆయన కవిత్వానికే ఒక భూషణం. ప్రాకృతిక కవిత్వంలో ఆయన అఖండ ప్రజ్ఞాధురీణుడు. పాల కడలి కెరటాల వంటి ఆయన కవితలు మనకెప్పుడూ రసక్షీరాన్నపు విందులే!

# సమాజం మారకుండా భాష మారుతుందా?

భాషలో అసమానత గురించీ, ఈ విషయంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయం గురించి కొండబాబు గారి ఆవేదన అర్థవంతమైనదే ('భాషలో అసమానతను ఎలా సరిచేద్దాం?' వివిధ: 13.04.2026). అయితే ఇక్కడ ఒక మౌలిక ప్రశ్న వేసుకోవాలి. సమాజంలో ఎన్నో అసమానతలున్నాయి. తరతరాల ఈ అసమానతలు మన రక్తంలో జీర్ణించుకుపోయి ఉన్నాయి. సమాజంలోని అసమానతల ప్రతిబింబమే భాషలోని అసమానతలు కూడా. పురుషాధిక్య వ్యవస్థలో స్త్రీల పట్ల చిన్నచూపు సర్వసాధారణమైపోయింది. స్త్రీవాద ఉద్యమాల వల్ల కొద్దిమందిలోనైనా కొంత స్పృహ వచ్చింది కానీ పూర్తి మార్పు రాలేదు. ఈ సామాజిక అసమానతల్ని రూపుమాపే ప్రయత్నం చేయకుండా కేవలం భాషలోని అసమానతల్ని తొలగించడం సాధ్యం కాదు.జంతువులు, వస్తువులతోబాటు స్త్రీలను కూడా అమహత్తులతో చేర్చారని కొండబాబు విమర్శ. సంస్కృతంలోని లింగ వివక్షకూ, తెలుగులోని లింగ వివక్షకూ చాలా తేడా ఉంది. సంస్కృతంలోని పదాలన్నిటినీ పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగాలుగా విభజించారు. పుంలింగాలంటే పురుష వాచక శబ్దాలు కాదు, స్త్రీ లింగాలంటే స్త్రీ వాచక శబ్దాలు కాదు, నపుంసక లింగాలంటే జంతువులూ, వస్తువులూ కాదు. శబ్దాలన్నిటినీ కుప్పగా పోసి దోసిళ్ళతో మూడు డబ్బాలకెత్తి మూడు పేర్లు పెట్టారు. పురుష వాచక, స్త్రీ వాచక శబ్దాలు అన్ని లింగాలలోనూ ఉంటాయి. ఉదాహరణకు 'దారాః' అనే శబ్దం స్త్రీ వాచకమైనా పుంలింగ శబ్దం. 'వృక్షః' అనేది పురుష వాచకం కాకపోయినా, పుంలింగ శబ్దం. కాని తెలుగులో అలా కాదు. పురుష వాచకాల్ని మహద్వాచకాలుగా, స్త్రీ వాచకాల్ని మహతీ వాచకాలుగా, ఇతర శబ్దాల్ని అమహద్వాచకాలుగా అర్థవంతంగా విభజించారు. అయితే క్రియాపదాల విషయంలో మాత్రం స్త్రీలకు సంబంధించిన వాటిని కూడా జంతువులు, వస్తువులకు సంబంధించిన పదాలతోనే వచ్చింది, పోయింది అనే ఉపయోగిస్తున్నాం. దీనికి కొండబాబు హేతుబద్ధంగా ఒక సూచన చేస్తున్నారు. పురుషులకు వాడే 'డు' టవర్గాక్షరం, స్త్రీలకు వాడే 'ది' తవర్గాక్షరం. కాబట్టి జంతువులకూ వస్తువులకూ పవర్గాక్షరం అయిన 'బి'ని వాడాలంటున్నారు. కానీ 'వచ్చింబి' అనేది పలకడానికి వినడానికి బాగా లేదు. జనం దీన్ని అంగీకరించడం కష్టం. భాష విషయంలో అలవాటు, సౌలభ్యం చూస్తారే గాని, హేతుబద్ధంగా ఆలోచించి కొత్త మార్పుల్ని స్వీకరించడం జరగదు. పూర్వం స్త్రీ పురుషులిద్దరికీ 'వచ్చెను' లాంటి సామాన్య రూపాలుండేవని కొండబాబు అన్నారు. అది స్త్రీ పురుషుల్ని సమానంగా చూసే దృష్టితో వచ్చింది కాదు. అది గ్రాంథిక భాషా రూపం. గ్రాంథిక భాషలో పురుషులకూ, స్త్రీలకూ, జంతువులకూ ఒకే క్రియారూపం 'వచ్చెను' అనేది. పురుషులకూ, స్త్రీలకూ 'రు' అని బహువచన రూపాన్నయినా వాడొచ్చని మరొక పరిష్కారాన్ని కూడా సూచించారు కొండబాబు. ఇది కొంత ఫరవాలేదు. అయితే ఈ బహువచన రూపాన్ని ఏకవచనంలో అన్ని సందర్భాల్లో వాడటం అలవాటు లేని వ్యవహారం కాబట్టి ఆచరణలో అంత సులభం కాదు.అసమానతల్ని ప్రతిబింబించే కొన్ని పదాలకు సరైన ప్రత్యామ్నాయ పదాలు ఒక్కోసారి వెంటనే దొరకవు. ఒకవేళ దొరికినా వాటిని వ్యవహారంలోకి తీసుకురావడం కష్ట సాధ్యం. మనిషిని గురించి చెప్పేటప్పుడు సాధారణంగా 'మానవుడు' అని ఉపయోగిస్తుంటాం. ఇది పురుష వాచకమే. కాని అందులో స్త్రీపురుషులిద్దరూ ఉంటారు. 'మనిషి' అనేది ఇద్దర్నీ తెలియజేసినా, 'మానవుడు' అనే మాటకే ఉపయోగం ఎక్కువ. వందల ఏళ్ళ అలవాటు సులభంగా మారదు.ఏదేమైనా సామాజిక వ్యవస్థలో, మానవ ప్రవర్తనలో మార్పు తీసుకురాకుండా కేవలం భాషలో అసమానతల్ని తొలగించడం గొంగట్లో కూర్చొని వెంట్రుకలు ఏరడం లాంటిదే.

## యువత గొంతుకలో తగ్గుతున్న పోరాట లక్ష్యం

చరిత్ర పుటలను తిరగేస్తే ప్రతి గొప్ప మార్పు వెనుక ఒక యువ కిశోరం, ఒక ఉత్సాహవంతుడైన విద్యార్థి లేదా వ్యవస్థను ఎదిరించిన ఒక యువ సమూహం కనిపిస్తుంది. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ అడుగుజాడల్లో నడిచిన వేలమంది యువకులు, అత్యవసర పరిస్థితి (జుఎవతీస్రవఅఎఎ) కాలంలో జయప్రకాష్ నారాయణ్ పిలుపుతో కదంతొక్కిన విద్యార్థి లోకం, మండల్ కమిషన్ సమరోత్సాహం ఇవన్నీ భారతీయ యువత తిరుగుబాటు స్ఫూర్తికి సజీవ సాక్ష్యాలు. అన్యాయం జరిగితే వీధుల్లోకి రావడం, పాలకులను నిలదీయడం నాటి తరం నైజం. కానీ, నేటి తరం ఈ విషయంలో కొంత భిన్నంగా కనిపిస్తోంది. ఒకప్పుడు మార్పుకు చిరునామాగా నిలిచిన యువత, నేడు నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతోంది. ఈ మార్పు అకస్మాత్తుగా రాలేదు. ఇది గత మూడు దశాబ్దాల సామాజిక, ఆర్థిక మరియు సాంకేతిక పరిణామాల సంక్లిష్ట ఫలితం.తిరుగుబాటు అంటే కేవలం ఆయుధాలు పట్టడం లేదా విధ్వంసం సృష్టించడం కాదు. అది ఒక ఆలోచనా దృక్పథం. అన్యాయాన్ని ప్రశ్నించడం, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపడం, మెజారిటీ అభిప్రాయంతో విభేదించే ధైర్యం చేయడం, అధికార యంత్రాంగానికి గట్టిగా లేదు అని చెప్పగలగడం ఇవన్నీ తిరుగుబాటు స్వభావంలో అంతర్భాగాలు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ఈ ప్రశ్నించే తత్వం ఎంతో అవసరం. కానీ నేటి యువత ఈ లక్షణాలను ప్రదర్శించడంలో ఎందుకు వెనుకడుగు వేస్తోంది? ఈ నిశ్శబ్దానికి గల కారణాలను లోతుగా విశ్లేషించవలసిన అవసరం ఉంది.సామాజిక మాధ్యమాలు (రాశీఎఖుశ్రీ వీఎఅఖు) యువతకు ఒక వినూత్నమైన వేదికను అందించాయి. మునుపటి తరాల వలె వీధుల్లో నిలబడి ఎండలో ఎండి, వానలో తడిసి నిరసన తెలపాల్సిన అవసరం నేడు లేదు. ఒక ట్వీట్, ఒక ఫేస్‌బుక్ పోస్ట్ లేదా ఒక ఇన్‌స్టాగ్రామ్ రీల్ ద్వారా తమ అభిప్రాయాన్ని లక్షలాది మందికి చేరవేయవచ్చు. దీనినే నిపుణులు "స్లాక్టివిజం" (రాశ్రీఖుఎన్‌అజఅంఎ) అని పిలుస్తున్నారు. అంటే, ఆన్‌లైన్‌లో ఒక బటన్ నొక్కడం ద్వారా తాము సామాజిక బాధ్యతను నెరవేర్చామని భావించడం.ఈ డిజిటల్ తిరుగుబాటు వల్ల కలిగే తృప్తి తక్షణమే లభిస్తుంది, కానీ దాని ఫలితం మాత్రం శూన్యం. అది కేవలం ఒక ఆవిరి వదిలే కుంపటి లాంటిది. అంతులేని వ్యాప్తి ఉంటుంది కానీ, క్షేత్రస్థాయిలో మార్పు రాదు. దీనికి తోడు, అల్గారిథమ్‌లు యువతను ఒక "ఎకో చేంబర్" (జుఎష్ట్రశీ జష్ఖుఎఎవతీ) లో బంధిస్తున్నాయి. మనకు నచ్చిన అభిప్రాయాలే మనకు పదే పదే వినిపించడం వల్ల, ఎదుటి పక్షం వాదన వినే ఓపిక, చర్చించే సంస్కృతి తగ్గిపోతున్నాయి. తిరుగుబాటుకు ఘర్షణ అవసరం, కానీ నేటి డిజిటల్ ప్రపంచం ఆ ఘర్షణను వడబోసి ఒక కృత్రిమ ఏకాభిప్రాయాన్ని సృష్టిస్తోంది.నేటి యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆర్థిక అభద్రత. ప్రపంచీకరణ తర్వాత ఉద్యోగ మార్కెట్ విపరీతమైన పోటీతో నిండిపోయింది. ఒకప్పుడు డిగ్రీ ఉంటే ఉద్యోగం వచ్చేది, కానీ నేడు పదుల సంఖ్యలో సర్టిఫికేట్లున్నా భరోసా లేదు. ఈ క్రమంలో, వ్యవస్థను సవాలు చేయడం అనేది ఒక విలాసంగా మారిపోయింది. ఒక విద్యార్థి నిరసనలో పాల్గొంటే, రేపు పోలీసు రికార్డుల వల్ల ఉద్యోగం రాదేమో అన్న భయం తల్లిదండ్రుల్లోనూ, యువతలోనూ బలంగా ఉంది.కార్పొరేట్ కంపెనీలు తమ ఉద్యోగుల సోషల్ మీడియా ప్రొఫైల్స్ ని నిశితంగా గమనిస్తున్నాయి. రాజకీయంగా చురుగ్గా ఉండటం లేదా వ్యవస్థను విమర్శించడం అనేది ఒక నెగటివ్ మార్క్ గా పరిగణించబడుతోంది. ఈ ఆర్థిక భయం తిరుగుబాటు స్ఫూర్తిని నిశ్శబ్దంగా హత్య చేస్తోంది. ఒక్క ఆన్‌లైన్ పోస్ట్ కూడా తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌కు హాని కలిగిస్తుందని భయపడే తరం, విప్లవాల గురించి ఎలా ఆలోచిస్తుంది? ఇది పిరికితనం కాదు, ఒక లోపభూయిష్టమైన వ్యవస్థ సృష్టించిన తప్పనిసరి మౌనం.గణాంకాలను గమనిస్తే నేటి యువత సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పులు .

## శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన




:- మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం రాజశ్యామల డాన్స్ అకాడమీ నాట్య గురువులు లీల కృష్ణ రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన లో వినాయక కౌతం, శ్రీ విఘ్న రాజాం భజే, దుర్గ తరంగం, అయిగిరినందిని, వన్దే వసుదేవం, బాలకనకమయ, అన్నమాచార్య కీర్తనలు, శ్రీనివాస కళ్యాణం, ప్రహ్లాద పట్టాభిషేకం మొదలైన అంశాలనుం హారిక, హర్షిత, జ్యోస్నా, రితిక, సాహితి, హర్షిత, ముక్త, శరణ్య, చైత్ర సాయి పూజిత, సౌజన్య, ఈక్షిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ : వీరారెడ్డి నరేందర్ రెడ్డి



:- అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీడిమెట్ల డివిజన్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రత కోసం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ సేవ చేయడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు




పాల్గొన్నారు.

## పేదరికముతో గ్రామాల్లోనే అధిక జనం ముదిరాజ్ కులం.

ముదిరాజ్ కులంలో 80 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో అవకాశాలు, సదుపాయాలు మెరుగ్గా ఉండటం వల్ల, పట్టణ ముదిరాజ్ కుటుంబాలు కొంచెం మెరుగ్గా ఉంటాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న 80 శాతం ముదిరాజ్ కుటుంబాలు అత్యంత కష్టమైన పరిస్థితులలో జీవనం సాగిస్తున్నాయి.గ్రామీణ ముదిరాజ్ కుటుంబాల ప్రధాన జీవనాధారాలు చేతి పనులు, వ్యవసాయ కూలీ, పశుపోషణ, చేపల వేట వంటివి. ఇవన్నీ అస్థిరమైన, తక్కువ ఆదాయం ఇచ్చే పనులు. మహబూబ్ నగర్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాదు, మెదక్ , నిజామాబాద్, నల్లగొండ వంటి జిల్లాల్లో ముదిరాజ్ కుటుంబాలు చేపల వేట, చెరువులు, కుంటలు, నది పనుల మీద ఆధారపడతారు. కరువు కాటకాలు వచ్చినప్పుడు, చెరువులు, నదులు ఎండిపోయినప్పుడు ఈ కుటుంబాలు పస్తులు ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారిలో అత్యంత పేదరికంలో జీవనం సాగిస్తున్న కులంగా ముదిరాజులు ప్రభుత్వ సర్వేల ద్వారా నిర్ధారించబడ్డారని ూజుజుజుూజ డేటా చెప్తోంది. ఇది ఒక చారిత్రాత్మక అన్యాయానికి నిలువుటద్దం. రాజకీయ ప్రాతినిధ్యం: ఓటు వేస్తున్నారు కానీ, గౌరవం పొందడం లేదు ? 26 లక్షల జనాభా, రాష్ట్ర దీజ కులాల్లో అత్యధిక సంఖ్య. ఇంత జనాభా ఉన్నప్పటికీ, శాసనసభలో, లోక్‌సభలో, మంత్రివర్గంలో, ప్రభుత్వ కమిటీలలో ముదిరాజ్ ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తికి తగినట్లు లేదు. 1952 నుండి 2024 వరకు తెలంగాణ (ఆంధ్రప్రదేశ్ కాలంతో సహా) శాసనసభ్యుల్లో ముదిరాజ్ నాయకుల సంఖ్యను లెక్కిస్తే, జనాభా నిష్పత్తికి పోలిస్తే అది చాలా తక్కువగా ఉంటుంది.అన్ని రాజకీయ పార్టీలు, కాంగ్రెస్, దీ=ూ, దీజ్రీ, ూఖూ , జనసేన ఎన్నికల ముందు ముదిరాజ్ సమాజాన్ని తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తాయి. కానీ టికెట్లు ఇవ్వడంలో, మంత్రి పదవులు కట్టబెట్టడంలో, కీలక పదవులలో నియమించడంలో ఈ సమాజంపై (కులంపై)వివక్ష జరుగుతోంది.కొకాపేట్ భూమి కేటాయింపు, ముదిరాజ్ డెవలప్ మెంట్ ట్రస్ట్ ఏర్పాటు వంటి అంశాలలో కూడా ముదిరాజ్ కులంతో, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపు లేకుండా నిర్ణయాలు జరగడం రాజకీయ నిర్లక్ష్యానికి తాజా ఉదాహరణలు."ఓట్లు వేసే సమయానికి గుర్తొస్తున్న ముదిరాజ్ సమాజం, పదవులు పంచే సమయానికి మర్చిపోబడుతోంది."

**విద్య, ఉద్యోగ రంగాలలో అంతరాలు ?** విద్యాపరమైన వెనుకబాటు ముదిరాజ్ సమాజంలో తరాల తరాలుగా కొనసాగుతోంది. ఉన్నత పాఠశాల స్థాయి దాటి చదివే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఇంజినీరింగ్, వైద్య, న్యాయ విద్య వంటి వృత్తి విద్యలో ముదిరాజ్ విద్యార్థుల ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తికి పోలిస్తే చాలా తక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ముదిరాజ్ బాలికల విద్య ముఖ్యంగా ఆందోళనకరంగా ఉంది. 8వ తరగతి తరువాత బడి మానేసే బాలికల సంఖ్య అధికంగా ఉంది. కారణాలు అనేకం. పాఠశాల దూరంగా ఉండటం, వాహనం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, బాల్య వివాహాలు.తెలంగాణ ప్రభుత్వ గ్రూప్ ×, గ్రూప్ ×× సర్వీసులలో, కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ముదిరాజ్ అధికారుల సంఖ్య అత్యల్పంగా ఉంది. దీజ రిజర్వేషన్ కాగితాల మీద ఉన్నా, అర్హత సంపాదించే స్థాయిలో చదువు చదవగలిగే అవకాశాలు ముదిరాజ్ విద్యార్థులకు సమగ్రంగా అందడం లేదు.

**ఇది ఎవరి వైఫల్యం?** ముదిరాజ్ సమాజం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితికి ఒక్క కారణం లేదు, ఒక్క తరం వైఫల్యం కాదు. ఇది వ్యవస్థాగత నిర్లక్ష్యం, రాజకీయ కుటిలత్వం, పాలనా లోపాలు , ఇవన్నీ కలిసి రూపొందించిన చారిత్రాత్మక అన్యాయం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాల్లో, దీజ సమాజాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంలో ముదిరాజ్ సమాజాన్ని సరిగా చేర్చలేదు. కాకా కలేల్కర్ కమిషన్ (1955),

అనంత రామన్ కమిషన్ (1969-70), మండల్ కమిషన్ (1980) నివేదికలు అమలు జరగడంలో కూడా జాప్యం, వివక్ష ఉంది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ముదిరాజ్ సమాజానికి ప్రత్యేక అభివృద్ధి పథకాలు, నిధులు, మంత్రి పదవులు సమగ్రంగా కల్పించడం జరగలేదు. ప్రతి ప్రభుత్వం 'ముదిరాజ్ అభివృద్ధి' నినాదం చేస్తోంది, కానీ చర్యలు నత్తనడకన సాగుతున్నాయి.

# వాస్తవ జీవితం ఆధారంగా తెరకెక్కిన రాయవలస



కార్తిక్ జయంతిని హీరోగా పరి చయం చేస్తూ రే సన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'రాయవలస. ఈ చిత్రాన్ని గోపీ కృష్ణ జె నిర్మించగా, మహిళా దర్శకురాలు రాధిక జయంతి దర్శకత్వం వహించారు. 'లవ్ ట్రైడ్ బై ఫేట్అనే ట్యాగ్‌లైన్ వస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ ఈవెంటును ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ, 'టీజర్ చాలా బాగుంది. కార్తీక్ హీరోగా, వాళ్ల అమ్మ డైరెక్టర్‌గా, వాళ్ల నాన్న ప్రొడ్యూసర్‌గా ఉండడం చాలా క్రేజీగా అనిపించింది. కార్తీక్ చాలా టాలెంటెడ్. యాక్టింగ్, సింగింగ్, ప్రొడక్షన్ ఇలా అన్ని విషయాల్లో తనకు పూర్తి అవగాహన ఉంది. హీరోగా తనకి ఇది పెద్ద స్టెప్ అవ్వాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. 'ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉంది. కార్తీక్‌ని వాళ్ల తల్లిదండ్రులే ప్రొడ్యూస్ చేస్తూ డైరెక్ట్ చేయడం విశేషం. 11 ఏళ్లుగా వీళ్లు షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ ఇప్పుడు సినిమాతో వస్తున్నారు. ఇలాంటి క్వాలిటీని నేను గత పదిహేనేళ్లుగా ఏ ఎన్నారైలోనూ చూడలేదు. తప్పకుండా వాళ్లు పడిన కష్టానికి ఫలితం ఉంటుందని నమ్ముతున్నానుఅని కేఎల్ దామోదర్ ప్రసాద్ చెప్పారు. హీరో కార్తీక్ మాట్లాడుతూ,'టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. 'రాయవలస' రియల్ లైఫ్ ఆధారంగా తీసుకున్న స్టోరీ. దానికి అందరూ కనెక్ట్ అవుతారని, ఆదరిస్తారని నమ్ముతున్నాను. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఈ సినిమాకి హార్ట్. ఖచ్చితంగా మీకు నచ్చుతుంది అని అన్నారు.

హీరోయిన్ శ్రీష మాట్లాడుతూ,'ఇది మంచి విలేజ్ డ్రామా. చాలా కొత్త కథతో వస్తోంది. నన్ను ఈ సినిమాలో రాణి పాత్రలో నమ్మి ఈ అవకాశాన్ని ఇచ్చిన రాధికకి ధన్యవాదాలుఅని తెలిపారు. నిర్మాత గోపీకృష్ణ మాట్లాడుతూ,' రేసన్ ప్రొడక్షన్స్‌ను మేము పదేళ్ల క్రితమే మొదలుపెట్టాము. షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌లు, ఇండిపెండెంట్ సాంగ్స్ చేశాము. ఫైనల్‌గా ఇప్పుడు థియేటర్ మూవీతో వస్తున్నాము అని అన్నారు. నేను చేసిన 'మాయ' ఫిలింకి యూఎస్‌లో మంచి అప్లాజ్ వచ్చింది. సినిమా తీయాలనుకున్నప్పుడు చాలా కథలు విన్నాం. రాఖీ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ఈ సినిమాతో 'రాయవలస' రాధికగా గుర్తింపు తెచ్చుకుంటానని నమ్మకం ఉంది. మా వారికి కథ నచ్చి ప్రొడ్యూస్ చేద్దామని చాలా ఎంకరేజ్ చేశారు. నా కలని, మా అబ్బాయి కలని నెరవేర్చడానికి మా వారు ఎంతగానో సపోర్ట్ చేశారు. విజువల్స్, మ్యూజిక్ అన్నీ పర్ఫెక్ట్‌గా వచ్చాయి. ఇందులో ఐదు పాటలు ఉన్నాయి. అన్నీ కథకి తగ్గట్టుగానే ఉంటాయి.

# స్టెప్పులు వేయించే లబ్బరు బొమ్మ

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం 'అనకాపల్లి'. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కి ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. తాజాగా ఈ సినిమా నుంచి 'లబ్బరు బొమ్మ' అంటూ సాగే ఈ ఐటమ్ సాంగ్ రిలీజ్ అయ్యింది. ఇందులో తారక్ పొన్నప్ప స్టెప్పులు, నందినీ రాయ్ అందాలు ప్రేక్షకుల్ని కట్టి పడేసేలా ఉన్నాయి. రాంబాబు గోశాల సాహిత్యం ఎంతో ఫన్నీగా ఉండటంతో పాటు, దేవ్ జండ్ క్యాచీ ట్యూన్ ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. శ్రీ కృష్ణ, సాహితీ చాగంటి గాత్రం మరింత స్పెషల్ అట్రాక్షన్, యశ్ మాస్టర్ కొరియోగ్రఫీతో ఈ పాట మరింత ప్రత్యేకంగా మారింది అని మేకర్స్ తెలిపారు.



ఇప్పటికే 'అమ్మోరు దిగినాది' అనే పాట యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఇక ఈ 'లబ్బరు బొమ్మ' కూడా చార్ట్ బస్టర్‌గా నిలిచేలా ఉంది. మాస్ ఆడియెన్స్‌కి నచ్చే యాక్షన్ సీక్వెన్స్, యూత్ మెచ్చే లవ్ ట్రాక్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యే ఎమోషనల్ కంటెంట్‌తో ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప, త్రినాథ రావు నక్కిన, ఇంద్రజ అబ్బర్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాంద్రేగుల నాయుడు, నందిని రాయ్, సంగీత క్రిష్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి సహ నిర్మాత: కండేగుల కుమార్ రాజా, డీఓపీ : మాయా. వి, సంగీతం: దేవ్ జండ్, ఎడిటర్: శ్రీకృష్ణ అట్టలూరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సెత్రామరాజు మల్లెల, సంభాషణలు: ఉదయ్ భాగవతుల, ప్రొడక్షన్ డిజైనర్: రఘు కులకర్ణి.

# 'పవర్ పేటలో సేనాపతి రవిగా..



విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రముఖ బ్యానర్ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి మరో క్రేజీ ప్రాజెక్ట్ రాబోతుంది. సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రచయిత నుంచి దర్శకుడిగా మారిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా 'పవర్ పేట చిత్ర నిర్మాతలు ఆకట్టుకునే గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్ థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో హంగామాతో హై వోల్టేజ్ మూడ్‌లో ప్రారంభ ౕమవుతుంది. అభిమానుల అరుపు లు, సంబరాల మధ్య హీరో ఎంట్రీ, సిగరెట్ తాగుతూ సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం అలరించింది. ఆ తర్వాత ఆ నేల స్వభావం, దానికి శక్తినిచ్చే మనుషుల గురించి చెబుతూ తన పాత్ర ఇంటెన్స్ చూపించారు. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసిరే సీన్‌తో గ్లింప్స్ మరింత మాస్ ఫీల్‌ను అందించింది. సేనాపతి రవి అనే పాత్ర పేరును రివీల్ చేయడం ద్వారా ఆ క్యారెక్టర్‌లోని డామినేషన్, ఇంటెన్సిటీని సూచించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది.



# వైవిధ్యమైన సైకలాజికల్ థ్రిల్లర్

వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా నటిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్'. వెంకటేష్ మహా దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏంఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. తాజాగా మేకర్స్ ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. లీజ్ డేట్ పోస్టర్‌లో సత్యదేవ్ వయసు పైబడిన రాయల్ లుక్‌లో కనిపించారు. పోస్టర్ మొత్తం సైకలాజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఇంటెన్స్ వాతావరణాన్ని చూపించింది. ఈ చిత్రంలో దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సమర్పణ: మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, నిర్మాతలు: చింతా గోపాలకృష్ణ రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, ఎగ్జిక్యూటీవ్ ప్రొడ్యూసర్: దినేష్ యాదవ్ బి, డీఓపీ : కార్తీక్ పర్మార్, సంగీతం: స్మరణ్ సాయి, ప్రొడక్షన్ డిజైనర్: రోహన్ సింగ్.



# 'ఐ యామ్ గేమ్- రిలీజ్ డేట్ ఫిక్స్

దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఐ యామ్ గేమ్' ప్రస్తుతం ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేస్తున్న చిత్రాల్లో ఒకటిగా మారింది. దక్షిణ భారతదేశంలోని 100కి పైగా లొకేషన్లలో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా దుల్కర్ సల్మాన్ ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాల గురించి మాట్లాడుతూ,' నా కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన సినిమాల్లో ఇది అత్యంత స్టైలిష్ ఫిల్మ్. సినిమాలో నా పాత్రతో పాటు మొత్తం వరల్డ్‌ని చాలా మోడర్న్, స్టైలిష్‌గా డిజైన్ చేశారు. దర్శకుడు నహాస్ హిదాయత్ ప్రత్యేకంగా తనని ఓ కొత్త స్టైలిష్ అవతార్‌లో చూపించాలని భావించారు. అదే ఈ ప్రాజెక్ట్‌కు హైలెట్ గా మారింది– అని తెలిపారు. బ్లాక్‌బస్టర్ 'ఆర్‌డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. దుల్కర్ సల్మాన్



కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ చిత్రం మలయాళ సినీ పరిశ్రమలో కూడా అత్యంత పెద్ద రిలీజ్‌లలో ఒకటిగా నిలవనుంది. వే ఫారర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు. 'లోకా' వంటి మెగా బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిలిమ్స్ నుంచి వస్తున్న తదుపరి చిత్రం ఇదే. దుల్కర్ 40వ చిత్రంగా తెరకెక్కుతున్న దీన్ని భారీ స్థాయిలో పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com